ప్రభాత
సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news



విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news



హైదరాబాద్
7-12-2025
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 95

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# తెలంగాణ భవితకు బాట గ్లోబల్ సమ్మిట్

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్శించడమే లక్ష్యం

విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచాన్ని ఆకర్శిస్తాం

8న గవర్నర్ జిష్టుదేవ్ వర్మ ప్రారంభోత్సవం

మీడియాకు వెల్లడించిన మంత్రుల భట్టి, శ్రీధర్ బాబు



2లో



## గోవాలో అగ్ని ప్రమాదం

సిలిండర్ పేలి 23 మంది మృతి



## విదేశీ చట్టాలను మనదేశంలో
# ఎలా తెస్తారు

ఇక్కడి సామాజిక పరిస్థితులు వేరు కదా

కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్రంపై పోరాడుదాం

రౌండ్ టేబుల్ సమావేశంలో కెటిఆర్ పిలుపు

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** ప్రపంచంలోనే అత్యంత కుబేరులు భారతదేశంలో ఉన్నారని, అలాగే అత్యంత పేదరికం కూడా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'ప్రపంచమే కుగ్రామం' అనే పేరుతో అమెరికా, ఐరోపాలో తెచ్చిన చట్టాలను ఇక్కడ తెస్తే కుదరదని హెచ్చరించారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లలో భాగంగా కొత్త సంస్కరణలు తెస్తున్నారని, అయితే.. సామాజిక స్థితులను పరిగణనలోకి తీసుకోకుండా

2లో




## ముగిసిన పుతిన్ భారత పర్యటన

కీలక మలుపు తిప్పిన పుతిన్ రాక

## క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డ రష్యా

ఉక్రెయిన్ వ్యాప్తంగా రాత్రంతా మోగిన సైరన్లు

కీవ్: రష్యా మరోసారి పేట్రేగిపోయింది.



2లో

## ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి నల్గొండ జిల్లాకు
# నీరు అందిస్తాం

## కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోకుండా నిర్లక్ష్యం

- ప్రజలను పట్టించుకోకుండా నిరంకుశంగా కెసిఆర్ పాలన
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు
- దొడ్డు బియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం
- పేదలకు 4.50లక్షల ఇళ్లు మంజూరు చేశాం
- దేవరకొండ సభలో సిఎం రేవంత్

గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులను పండబెట్టారని, ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండ జిల్లాకు నీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎస్‌ఎల్‌బీసీను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు, నిర్లక్ష్యం చేశారు. ఎస్‌ఎల్‌బీసీ ఆగిందని మామ, అల్లుడు డ్యాన్సులు చేస్తున్నారు.



**దేవరకొండ, ప్రభాత సూర్య :**ఎవరూ అడ్డుపడ్డా ఎస్ఎల్‌బీసీను పూర్తిచేసి తీరుతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో రూ.23 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. పోరాటాల పౌరుషం ఉన్న గడ్డ నల్గొండ. నిజాం నిరంకుశ పాలనను ఎదురించిన జిల్లా నల్గొండ. ప్రజా ప్రభుత్వానికి అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు అని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు ఇచ్చింది. రేషన్ కార్డులపై దొడ్డు బియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఆకలి తీర్చినప్పుడే నిజమైన ఇందిరమ్మ రాజ్యం అని మన ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తోంది.

2లో




## ప్రయాణికుల డబ్బు వెంటనే వెనక్కి

ఇండిగో సంక్షోభంతో ధరలు పెంచకుండా చర్యలు

పరిస్థితిపై పూర్తిస్థాయిలో చర్యలు: రామ్మోహన్ నాయుడు


2లో

## విపరీతంగా పెరిగిన విమాన టికెట్ల ధరలు

సొమ్ము చేసుకుంటున్న విమానయాన సంస్థలు

ధరలపై గగ్గోలు పెడుతున్న ప్రయాణికులు

# శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు



పరకామణి దొంగతనం చిన్నది ఎలా అవుతుంది

- దానిని సెటిల్‌మెంట్ ఎలా చేస్తారు
- జగన్‌కు దేవుడన్నా లెక్కలేకుండా పోయింది
- జగన్ మూలంగా మాఫియాలు తయారయ్యారు
- శాంతిభద్రతలపై రాజీపడేది లేదు
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం చంద్రబాబు నాయుడు

2లో


## అమెరికా ప్రమాదంలో హైదరాబాద్ యువతి మృతి



# గ్లోబల్ సమ్మిట్ కాదు.. యూరియా సంగతి చూడండి

ఉత్తర కుమార ప్రగల్భాలకు పరిమితమైన రేవంత్

విమర్శలు చేసిన మాజీమంత్రి హరీష్ రావు



**హైదరాబాద్,ప్రభాత సూర్య :** రాష్ట్రంలో యూరియా కష్టాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు.

# అమెరికా ప్రమాదంలో హైదరాబాద్ యువతి మృతి

**హైదరాబాద్,ప్రభాత సూర్య :** అమెరికాలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో తెలుగు యువతి ఉడుముల సహజా రెడ్డి ప్రాణాలు కోల్పోయింది. ఉన్నత చదువుల కోసం నాలుగేళ్ల క్రితం అమెరికా వెళ్లిన ఆమె అనుకోని విధంగా చనిపోయింది. గురువారం రాత్రి ఈ విషాదం చోటుచేసుకుంది. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల ప్రాంతంలోని గుంటూరుపల్లికి చెందిన ఉడుముల జయాకర్ రెడ్డి, శైలజ భార్యాభర్తలు. జయాకర్ రెడ్డి టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. శైలజ బచ్చన్నపేట మండలంలో ఎస్జీటీగా పని చేశారు. జయాకర్ కుటుంబం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి సెటిల్ అయింది. జోడిమెట్లలో నివాసం ఉంటోంది. జయాకర్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు సహజారెడ్డి 2021లో ఎంఎస్ చదవటం కోసం అమెరికాకు వెళ్లింది. అలబామా యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 13 మంది విద్యార్థులు బర్మింగ్‌హామ్‌లోని అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఉంటున్నారు. 13 మందిలో ఉడుముల సహజా రెడ్డి కూడా ఉంది. భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకున్న సహజారెడ్డి అక్కడికక్కడే చనిపోయింది. అధికారులు ఆమె మరణ వార్తను జోడిమెట్ల వెంకటాపూర్ రోడ్డులోని శ్రీనివాస కాలనీలో నివాసం ఉంటున్న ఆమె తల్లిదండ్రులకు తెలియజేశారు. సహజారెడ్డి మరణ వార్త తెలిసి కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. అమెరికాలోని భారత ఎంబసీ సహజారెడ్డి మరణంపై దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేసింది. ఆమె కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేసింది. వారితో సంప్రదింపులు జరుపుతోంది. అవసరమైన సాయం అందిస్తామని తెలిపింది.

## ప్రయాణికుల డబ్బు వెంటనే వెనక్కి

**న్యూఢిల్లీ,ప్రభాత సూర్య :** ఇండిగో సంక్షోభం నేపథ్యంలో విమాన టికెట్ల ధరలు పెంచకూడదని ఆదేశాలు ఇచ్చామని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఈ పరిస్తితి ఆధారంగా సంస్థలు ధరలు పెంచితే ఊరుకోబోమని అన్నారు. విమాన టిక్కెట్ గరిష్ఠంగా రూ.18వేలు మించొద్దని ఆదేశాలు జారీ చేశారు. టికెట్ ధరలను నాలుగు కేటగిరీలుగా మంత్రిత్వ శాఖ విభజించారు. 500 కిలోమీటర్లకు ఒక రేటు, 500 నుంచి 1000 కిలో మీటర్లకు ఒక రేటు ఉంటుందని మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఇండిగో విమానాల రద్దు, ప్రయాణికుల అవస్థలపై కేంద్రమంత్రి మాట్లాడారు. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలు అందరూ పాటిస్తున్నారు. ప్రత్యేకంగా కమిటీ వేసి విచారణకు ఆదేశించాం. కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం. ఇండిగో కచ్చితంగా సమాధానం చెప్పాల్సిందేనని అన్నాఉ. మా మంత్రిత్వశాఖ పూర్తి దృష్టి ప్రయాణికులపైనే ఉందన్నారు . ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించాం. రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. 24గంటల్లోగా అంటే ఆదివారం రాత్రి 8గంటల్లోపు రీఫండ్ చేయాలని ఇండిగోను ఆదేశించాం అని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇండిగో సంక్షోభంతో ప్రయాణికులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులందరికీ రేపటిలోగా డబ్బులు రిఫండ్ చేయాలని ఆదేశించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అంశం పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపడుతున్నామని హెచ్చరించారు.

## గోవాలో అగ్ని ప్రమాదం

ఉత్తర గోవాలోని అర్పోరాలోని ఒక క్లబ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. రాష్ట్రంలోని అత్యంత ప్రసిద్ధ బీచ్‌లలో ఒకటైన బాగాలోని బిర్చ్ బై రోమియో లేన్ అనే క్లబ్‌లో అర్ధరాత్రి సమయంలో సిలిండర్ పేలడం వల్ల మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 23 మంది మరణించినట్లు సమాచారం సమాచారం అందుకున్న వెంటనే అనేక అగ్నిమాపక యంత్రాలు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపడుతున్నారు. మృతులలో ముగ్గురు మహిళలు, నలుగురు పర్యాటకులతో సహా మొత్తం 23 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. డీజీపీతో సహా సీనియర్ పోలీసు అధికారులు, ఉత్తర గోవా జిల్లా నుంచి పోలీసు బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. గోవా డీజీపీ అలోక్ కుమార్ మాట్లాడుతూ.. అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగాయి. దీంతో ఎక్కువమంది సిబ్బంది మరణించారని అన్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, స్థానిక ఎమ్మెల్యే మైఖేల్ లోబో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ముఖ్యమంత్రి.. ప్రమాదంపై విచారణ జరుపుతామని, బాద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## విదేశీ చట్టాలను మనదేశంలో ఎలా తెస్తారు

ఏ చట్టాలు తెచ్చినా వాటిపై తిరగబడాల్సిందేనని కేటీఆర్ హెచ్చరిక చేశారు. తెలంగాణ భవన్‌లో కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ మీటింగ్‌లో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోనియా గాంధీ ఢిల్లీలో వ్యతిరేకించిన బిల్లును, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందని కేటీఆర్ ప్రశ్నించారు. ఇక్కడి నుంచే పోరాటాన్ని మొదలుపెడదామని పిలుపునిచ్చారు. ఢిల్లీలో కేంద్ర కార్మిక మంత్రిని, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సభ్యులను కలుద్దామని.. లేబర్ కోడ్‌ల అమలు ఆపేదాకా అసెంబ్లీ, మండలి సమావేశాలు స్తంభింపజేస్తామని అన్నారు. దీనిపై వరంగల్‌లో తదుపరి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. దేశంలో 92శాతం మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. సిరిసిల్ల చేనేత కార్మికులను ఆదుకునేందుకు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.3,500 కోట్ల మేర బతుకమ్మ చీరల తయారీకి కేసీఆర్ ఆర్డర్ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే, కొందరు పిచ్చోళ్లు తెలియక ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శలు గుప్పించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే కేసీఆర్ చలించిపోయి పార్టీ తరఫున ఆర్థిక సాయం చేశారన్నారు.

## విపరీతంగా పెరిగిన విమాన టికెట్ల ధరలు

**న్యూఢిల్లీ, ప్రభాత సూర్య :** దేశీయ విమానయాన రంగంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న గందరగోళం శుక్రవారం మరింత తీవ్రరూపం దాల్చింది. ఇండిగోకు చెందిన వందలాది విమాన సర్వీసుల రద్దు కావడంతో ఎదురైన పరిస్థితిని ఇతర విమానయాన సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రయాణికులను తీవ్రంగా దోచుకుంటున్నాయి. టికెట్ ధరలను భారీగా పెంచేశాయి. సాధారణ ధరల కంటే ఏకంగా 3 నుంచి 10 రెట్లు అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. అత్యవసర ప్రయాణాలు చేయాల్సిన వారికి ఇది పెనుభారంగా మారింది. ప్రధాన నగరాల మధ్య ఒక్కరోజు ప్రయాణానికి సంబంధించిన టికెట్ ధరలు ఆకాశాన్ని తాకాయి. శుక్రవారం నాటి ధరలను పరిశీలిస్తే దిల్లీ – బెంగళూరు విమాన టికెట్ ధర రూ. 1,02,000గా నమోదు కాగా.. చెన్నై – దిల్లీ మార్గంలో టికెట్ ధర రూ. 90,000కు చేరింది. అదేవిధంగా దిల్లీ – ముంబైకి ఒక టికెట్ ధర ఏకంగా రూ. 54,222 పలికింది. ఇతర విమానయాన సంస్థల టికెట్ల ధరలు కూడా రూ. 20 వేల నుంచి రూ. 40 వేల మధ్యలో కొనసాగుతున్నాయి. ముంబై – శ్రీనగర్ మార్గంలో సాధారణంగా రూ. 10 వేల లోపు ఉండే టికెట్ ధర, ఇప్పుడు రూ. 62,000కు పెరిగింది. రౌండ్ ట్రిప్ తీసుకుంటే దాదాపు రూ. 92 వేల వరకు ఉంటోంది. దిల్లీ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణించాలనుకునే వారికి కూడా అధిక ధరల సెగ తగిలింది. శనివారం నాటి ప్రయాణానికి దిల్లీ–హైదరాబాద్ ఎయిరిండియా విమాన టికెట్ ధర రూ. 33,000కు చేరుకుంది.

# ముగిసిన పుతిన్ భారత పర్యటన

**న్యూఢిల్లీ, ప్రభాత సూర్య:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండురోజుల భారత పర్యటన ముగిసింది. శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన విందుకు హాజరయ్యారు. విందు ముగిసిన తర్వాత అక్కడి నుంచి పుతిన్ నేరుగా విమానాశ్రయానికి చేరుకున్నారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ విమానాశ్రయానికి వెళ్లి వీడ్కోలు పలికారు. 'కలిసి సాగుదాం, కలిసి ఎదుగుదాం'.. అన్న నినాదంతో పుతిన్ తన భారత పర్యటనకు ముగింపు పలకడం విశేషం. గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న పుతిన్‌కు ప్రధాని మోడీ స్వయంగా ఎయిర్‌పోర్టుకు వెళ్లి స్వాగతం పలికిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం పుతిన్‌కు రాష్ట్రపతి ముర్ము అధికారికంగా స్వాగతం పలికారు. భారత్– రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా భారత్ – రష్యా మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. రక్షణ, ఇంధనంసహా అనేక రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక చర్చలు సాగాయి. ఈ పర్యటన సందర్భంగా పుతిన్‌కు ప్రధాని మోడీ వివిధ బహుమతులు అందించారు. ఇందులో రష్యన్ ఎడిషన్ భగవద్గీత, కాశ్మీరీ కుంకుమ పువ్వు, అసోం బ్లాక్ టీ, బెంగాల్ ముర్షిదాబాద్‌కు చెందిన వెండి టీ సెట్, మహారాష్ట్రలో చేతితో తయారు చేసిన వెండి గుర్రం, ఆగ్రా నుంచి తెచ్చిన మార్బుల్ చెస్ సెట్ వంటివి ఉన్నాయి. పుతిన్ పర్యటనలో భాగంగా భారత ప్రధాని నరేంద్రమోడీ మరో కీలక ప్రకటన చేశారు. రష్యన్లకు 30 రోజులపాటు ఉచిత ఇ టూరిస్టు, గ్రూప్ టూరిస్టు ఉచిత వీసాలను త్వరలో ప్రారంభిస్తామని మోడీ ప్రకటించారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో పుతిన్‌తో కలిసి సంయుక్తంగా జరిగిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని మోడీ వెల్లడించారు. అందువల్ల రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలతోపాటు ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలూ బలపడతాయని ఆయన ఆకాంక్షించారు. భారత పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో శుక్రవారం జరిపిన శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాల మధ్య మొత్తం 11 కీలక ఒప్పందాలు కుదిరాయి. ఆరోగ్యం, ఆహార భద్రత, నౌకాయానం, ఎరువులు, విద్య, భారత్ నుంచి రష్యాకు నిపుణులైన కార్మికుల వలస తదితర రంగాల్లో పరస్పర సహకారం పెంపునకు ఇవి దోహదపడ నున్నాయి. మాస్కోతో వాణిజ్య లోటును పూడ్చుకోవడంలో దిల్లీకి సాయపడనున్నాయి. భౌగోళిక రాజకీయాలు ఎన్నెన్నో కుదుపులకు లోనైనప్పటికీ.. భారత్–రష్యా స్నేహం ధ్రువతారలా నిరంతరం వెలుగులీనుతూనే ఉందని పుతిన్‌తో భేటీలో మోదీ వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత మార్గాల్లో ముగింపు పలకాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. భారత్–రష్యా బిజినెస్ ఫోరమ్‌లోనూ మోదీ, పుతిన్ పాల్గొన్నారు. గత 8 దశాబ్దాల్లో ప్రపంచం ఎన్నో ఎత్తుపల్లాలను చూసింది. మానవాళి అనేక సవాళ్లు, సంక్షోభాలను ఎదుర్కొంది.

# గతంలో ఎవరినైనా దగ్గరకు రానిచ్చావా కెసిఆర్?

(మొదటి పేజీ తరువాయి)

బొందపెడుతూనే ఉంటారని కెసిఆర్‌ను ఉద్దేశించి సిఎం అన్నారు. దేవరకొండ బహిరంగ సభలో మాట్లాడిన రేవంత్.. ఇద్దరు సర్పంచులను, వార్డు మెంబర్లను కేసీఆర్ పిలిపించుకుని మాట్లాడారని.. గతంలో కేసీఆర్ ఎవరితోనైనా మాట్లాడేవారా అని ప్రశ్నించారు. మళ్లీ మనదే రాజ్యం అంటున్నారని, ఇప్పటిదాకా దోచుకున్నది చాలలేదా కెసిఆర్ అని విమర్శించారు. పదేళ్లలో గడీలు కట్టుకుని ప్రజలకు దూరంగా ఉన్నారని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులకు కూడా అపాయింట్ మెంట్ ఇవ్వని కేసీఆర్.. ఇపుడు సర్పంచ్ లను,వార్డు మెంబర్లను పిలిచి మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. ఒకప్పుడు కేసీఆర్ ఎంతో ఘనంగా బతికారని.. వాళ్ల ఎమ్మెల్యేలకు కూడా అపాయింట్ మెంట్ ఇచ్చేవాడు కాదన్నారు...మంత్రులను గేట్ దగ్గరి నుంచే పంపించేవారని చెప్పారు. తాము అధికారం చేపట్టాక నిలువ నీడలేని పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామన్నారు. గత పదేండ్లలో కేసీఆర్ ఎవరికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కడుతున్నామని..ఇందిరమ్మ ఇండ్ల కోసం 22500 కోట్ల ఖర్చుచేస్తున్నామని తెలిపారు. కేసీఆర్ పదెకరాల్లో 150 కోటల గడీ కట్టుకున్నారు కానీ..పేదవాడికి ఒక్క డబుల్ బెడ్రూం ఇవ్వలేదని చెప్పారు. 200యూనిట్ల ఉచిత కరెంట్ ఇవ్వడంతో పేదల ఇంట్లో వెలుగులు నిండాయన్నారు. పేదవాళ్ల పట్ల కేసీఆర్‌కు అభిమానం లేదన్నారు. మంచిరోజులొస్తాయంటున్నారని.. తెలంగాణ ను పీక్కుతిన్న మీ ఆకలి తీరలేదా?. 8లక్షల కోట్ల అప్పులు చేసిన ఆకలి తీరలేదా అని కెసిఆర్‌ను ప్రశ్నించారు. ఆనాడు చెప్పులు అరిగేలా తిరిగినా రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. ప్రజాపాలనలో అడిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో అత్యధిక రేషన్ కార్డులు దేవరకొండలోనే ఉన్నాయని తెలిపారు., కొత్త రేషన్ కార్డులతో పేదవాడు ఆత్మగౌరవంతో బతికేలా చేశామన్నారు. 3కోట్ల తెలంగాణ ప్రజలు సన్నబియ్యం తింటున్నారని చెప్పారు.

# తెలంగాణ భవితకు బాట గ్లోబల్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్,ప్రభాత సూర్య :** గ్లోబల్ సమ్మిట్ తెలంగాణ భవిష్యత్ కు సంబంధించిన సమ్మిట్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రానికి కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సమ్మిట్ ఉపయోగ పడుతుందన్నారు. గ్లోబల్ సమిట్.. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు సంబంధించింది, మా విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గ్లోబల్ సమిట్ వివరాలను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన మీడియాకు వివరించారు. డిసెంబర్ 8 మధ్యాహ్నం ఒంటిగంటకు గ్లోబల్ సమ్మిట్ ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభిస్తారని చెప్పారు. తొలి రోజు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. మొత్తం 27 సెషన్లు ఉంటాయన్నారు. తెలంగాణ విజన్ డాక్యుమెంటరీ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తామని చెప్పారు. ఈ మేరకు శనివారం గవర్నర్ విష్ణుదేవ్ వర్మను కలిసిన భట్టి సమ్మిట్‌కు ఆహ్వానించారు. డిసెంబర్ 8న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ప్రసంగాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 2.30గంటలకు రేవంత్ ప్రసంగిస్తారని చెప్పారు . మధ్యాహ్నం 3 గంటల నుంచి పలు రంగాలపై చర్చ జరుగుతుందని.. 3 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ రంగంపై చర్చ ఉంటుందని తెలిపారు. సెమీకండక్టర్లు, గ్రీన్ ఎర్జీ , ఎరోస్పేస్ ఎడ్యుకేషన్ పై చర్చ జరుగుతుందన్నారు. సాయంత్రం 6గంటలకు సమ్మిట్ ముగుస్తుందన్నారు డిసెంబర్ 9వ తేదీ ఉదయం 10 గంటలకు సమ్మిట్ మళ్లీ ప్రారంభం అవుతుందని భట్టి చెప్పారు. సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంద న్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కోరుకునే వారు ఈ సమ్మిట్ లో పాల్గొనవచ్చని చెప్పారు. ఇండిగో విమాన సమస్య ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యమైన వాళ్లు రావడానికి ఇబ్బంది ఉంటే వాళ్లకు ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో 27 సెషన్లు ఉంటాయి. వివిధ రంగాలకు చెందిన నిపుణులు, నిష్ణాతులను సమిట్‌కు ఆహ్వానించాం. ఎయిర్‌లైన్స్ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం. సమిట్‌కు వివిధ దేశాల ప్రతినిధులు భారీ సంఖ్యలో వస్తారు. ముఖ్యఅతిథులకు సమస్య వస్తే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తాం. ఇలాంటి సమిట్ గతంలో ఎప్పుడూ జరగలేదు‘ అని భట్టి విక్రమార్క తెలిపారు. ఇకపోతే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ అజెండా ఖరారైంది. సోమ, మంగళవారాల్లో ఫ్యూచర్‌సిటీ వేదికగా ఈ సమిట్ జరగనుంది. అంగరంగ వైభవంగా అంతర్జాతీయ ఆర్థిక సదస్సు నిర్వహణకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. రెండ్రోజుల సదస్సులో వివిధ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి ప్రముఖులు తరలిరానున్నారు. 8, 9 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలోని 'ఫ్యూచర్ సిటీ'లో 100 ఎకరాల విస్తీర్ణంలో సదస్సు నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల నుంచి దిగ్గజ పారిశ్రామికవేత్తలు, సినీ, క్రీడా ప్రముఖులు హాజరు కానుండడంతో.. అంతర్జాతీయ ప్రమాణాలతో వేదికలు సిద్ధమవుతున్నాయి. 9న సాయంత్రం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ డాక్యుమెంట్ ఆవిష్కరించనున్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్ మ్యాప్‌ను ప్రభుత్వం ప్రకటించనుంది. ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సెషన్‌లో పీవీ సింధు, అనిల్ కుంబ్లే, పుల్లెల గోపిచంద్, గగన్ నారంగ్, జ్వాలా గుత్తా పాల్గొననున్నారు.

## గ్లోబల్ సమ్మిట్ కాదు.. యూరియా సంగతి చూడండి

రేవంత్ రెడ్డి గారూ.. నిన్ననే మీరు పర్యటించిన నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపూర్ మండలం ధర్మరావు పేట గ్రామంలో యూరియా కోసం రైతులు పడుతున్నఅగచాట్లు ఇవి అని ఒక వీడియోను సోషల్‌మీడియా వేదికగా పోస్టు చేశారు.రైతులకు యూరియా సరఫరా చేయడం చేతగాని రేవంత్ రెడ్డి, ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిందని హరీశ్‌రావు మండిపడ్డారు. విజయోత్సవాల పేరిట ప్రభుత్వ ధనం దుబారా చేస్తూ.. చేసింది లేక, చెప్పకునేది లేక గప్పాలు కొట్టిండని విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్ అంటూ, విజన్ 2047 అంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న రేవంత్ రెడ్డి , ముందు రైతులకు యూరియా సరఫరా చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ ప్రణాళికను గాలికి వదలి రైతులు, మహిళలు, వృద్దులు అందర్నీ యూరియా కోసం గంటల కొద్దీ క్యూ లైన్లలో నిలబెడే పరిస్థితి తెచ్చావని సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. మీ దుర్మార్గ పాలన రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. మీ రైతు వ్యతిరేక విధానాతో రైతులు నరకం చూస్తున్నారని అన్నారు. గత సీజన్ యూరియా కష్టాలు, చేదు అనుభవాల నుంచి మీరు, మీ ప్రభుత్వం ఏం నేర్చుకోకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. సీజన్ ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే, ముమ్ముందు పరిస్థితి ఇంకా ఎంత దారుణంగా ఉంటుంది? అని ప్రశ్నించారు. యూరియా కొరత రాకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా మాట్లాడే తీరు అంటూ ఫైర్ అయ్యారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మండిపడ్డారు. శనివారం అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి సీఎం చంద్రబాబు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో పలు కీలక అంశాలపై మాట్లాడారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ముఖ్యమంత్రి చిట్‌చాట్ చేశారు. శ్రీవారి పరకామణి దొంగతనం వ్యవహారంపై జగన్ చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రతినిధులు ప్రస్తావించారు. పరకామణి దొంగతనం చిన్న దొంగతనం అంటూ జగన్ వ్యాఖ్యలు అందరినీ విస్తుగొలిపాయని చెప్పుకొచ్చారు. జగన్‌కు దేవుడన్నా లెక్కలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలన్నా లెక్కలేదని... ఆలయాలు పవిత్రత అన్నా లెక్కలేదని ధ్వజమెత్తారు. 'జగన్ తన బాబాయి వివేకా హత్యనే సెటిల్ చేసుకుందామని చూశారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల పరకామణి చోరీని కూడా సెటిల్ చేయాలని చూశారు.. ఇంతకంటే ఘోరం ఉంటుందా? దొంగతనాన్ని కూడా తప్పు కాదని చెప్పే వాళ్లను ఏమనాలని ఆగ్రహం చెందారు. సెంటిమెంట్ విషయాల్లో కూడా సెటిల్‌మెంట్ అంటూ వ్యాఖ్యాలా.? దొంగతనం చేసిన వ్యక్తి డబ్బులు తిరిగి కట్టాడు కదా...తప్పేముందని జగన్ అత్యంత అనైతికంగా వాదిస్తున్నారు. భక్తులు, ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. శ్రీవారి ఆలయంలో ప్రతి అంశంలోనూ భక్తుల సెంటిమెంట్ ముడిపడి ఉంటుంది. అలాంటి సున్నిత అంశాలను కూడా సెటిల్‌చేశామని తేలికగా జగన్ మాట్లాడుతున్నారు. భక్తుల ఇచ్చిన కానుకలు, ముడుపులను కొట్టేసిన దొంగలతో సెటిల్‌మెంట్ ఏంటని అన్నారు. శ్రీవారి హుండీలో చోరీపై జగన్ చేసిన వ్యాఖ్యలపై అన్నివర్గాల ప్రజల్లోనూ తీవ్ర ఆవేదన కనిపిస్తోందని చంద్రబాబు అన్నారు. వర్గాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా ఆ వ్యాఖ్యలను తప్పుపడుతున్నారు. రూ.72 వేలు అనేది చిన్న దొంగతనమని చెబుతున్నాడు. దేవుడు హుండీలో చోరీ చిన్న తప్పా? దాన్ని సెటిల్ చేయడం మహాపాపం కాదా? కోట్ల మంది భక్తుల విశ్వాసాలు దెబ్బతీసేలా పరకామణి విషయంలో జగన్ ఇలాంటి వ్యాఖ్యలు ఘోర పాపం కాదా' అని సీఎం చంద్రబాబు ప్రశ్నల వర్షం కురిపించారు. ఏమాత్రం నైతికత లేని వాళ్లే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారని మండిపడ్డారు. తిరుమల పరకామణిలో రూ.70వేల చోరీకి రూ.14కోట్ల ఆస్తి రాసిచ్చేందుకు సిద్ధపడ్డారంటే ఇంకెంత సంపాదించి ఉంటారని ప్రశ్నించారు. తితిదేలో దోపిడీ ఏ స్థాయిలో చేశారో దీనిబట్టే అర్థమవుతోందన్నారు. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. జగన్‌కు దేవుడన్నా, ఏడుకొండల వాడి భక్తుల మనోభావాలు అన్నా, ఆలయాలు పవిత్రత అన్నా లెక్కలేదని దుయ్యబట్టారు. చుక్క పాలు లేకుండానే నెయ్యి తయారు చేసి దేవుడి ప్రసాదానికి సరఫరా చేసిన ఘనులా వీళ్లు అని సర్వత్రా చర్చ జరుగుతోంది. గతంలో నెల్లూరు, విజయనగరం జిల్లాలు ఎంతో ప్రశాంతంగా ఉండేవి.. వైకాపా హయాంలో నెల్లూరులో కూడా చాపకింద నీరులా మాఫియాను విస్తరింపజేశారు. లేడీడాన్స్ తయారవటం చూసి నాకే ఆశ్చర్యం కలిగింది. లా అండ్ ఆర్డర్ విషయంలో రాజీ ప్రసక్తే లేదని స్పష్టం చేశా. శాంతి భద్రతలు అదుపు చేస్తున్నాం. అధికారం చేపట్టిన నాటికీ ఇప్పటికీ చాలా మార్పు వచ్చింది. రాజధానిలో సమస్యలన్నీ పరిష్కారమై అభివృద్ధి జరుగుతుంటే రైతులు, ప్రజలు ఆనందంగా ఉన్నారు.

# ఉద్యాన పంటల సాగు లాభదాయకం

## పంట మార్పిడితో అధిక ఆదాయం

## పండ్ల తోటలలో అంతర పంటలుగా కూరగాయల సాగు.



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 6 :** పుల్కల్ కోహీర్ జహీరాబాద్ మండలాల్లోని పలు గ్రామాలలో సాగు చేస్తున్న మామిడి తోటలను పరిశీలించిన సంగారెడ్డి జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి సోమేశ్వరరావు సీజన్ ప్రారంభమవుతుంది కనుక మామిడి తోటల్లో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులతో పాటు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మొక్కలను ఉత్తేజ పరిచి తొందరగా పూత తెప్పించడానికి డిసెంబర్ 15 నుండి 20 ల మధ్యలో నీటి వసతి ఉన్న తోటల్లో పాదుల్లో తేలికపాటి తడి ఇవ్వడం లేదా లీటర్ నీటికి పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు,యూరియా 5 గ్రాముల చొప్పున కలిపి చెట్టుపై పిచికారి చేయడం వల్ల పూమొగ్గలు దాదాపు ఒకేసారి చిగురించి పూత త్వరగా వచ్చేలా చేయవచ్చు. పూలు వికసించకుండా చేసే తేనెమంచి పురుగులను లీటరు నీటికి 0.3 ఎంల్ ఇమిడ క్లోప్రిడ్ కలిపి పిచికారి చేయడం ద్వారా నివారించుకోవచ్చు మరియు క్లోరి పైరిపాస్ 2.5 ఎంల్ లీటరు నీటిలో కలిపి పూలగుత్తులపై పిచికారి చేయాలి.తెల్లని పొడి లాంటి (బూడిద తెగులు) బూజు నివారణకు పూమొగ్గలు కనిపించిన దశలో లీటర్ నీటికి 3 గ్రాముల నీటిలో కరిగే గంధకం లేదా లీటర్ నీటికి హెక్సా కోనజోల్ 2 ఎంల్ లేదా ప్రోపి కోనజోల్ 1 ఎంల్ లేదా డైనో కాప్ 1 ఎంల్ చొప్పున కలిపి పూత,కాడలు తడిచేలా పిచికారి చేయాలి.పూత మాడు తెగులు నివారణకు మొగ్గ బయటకు వచ్చే దశలో మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ పచ్చి పూత మీద 1 గ్రామ్ కార్బెన్డిజమ్ లేదా థయోఫినైట్ మిథైల్ 1 గ్రామ్ లీటరు నీటి చొప్పున కలిపి పిచికారి చేయాలని అన్నారు. మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని నిత్యం రోగ నిరోధక శక్తికి ఆరోగ్యంగా ఉండటానికి పోషకాలు అందించే పండ్ల తోటలు అయిన జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, సీతాఫలం, పనస, నేరేడు, అవకాడో, ఫ్యాషన్ ఫ్రూట్, కూరగాయలు, ఆకుకూరలు, మునగ మొదలైన పంటలను సాగు చేయాలని తద్వారా ఎకరానికి లక్ష రూపాయలు నికర ఆదాయం పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో పండ్ల మొక్కలనునాటుకోవాలని సూచించారు.పండ్లు, కూరగాయలు, పూల తోటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు నూతన సాగు విధానాలు ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, పర్టిగేషన్, పందిరిపై తీగ జాతి కూరగాయల సాగు మొదలైన పద్ధతులు పాటించాలని అన్నారు.




# అవినీతి రహిత సమాజానికి కృషి చేద్దాం: జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

### అవినీతి నిర్మూలన పై అవగాహన పోస్టర్ ను ఆవిష్కరించిన కలెక్టర్

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 06:** అవినీతి రహిత సమాజానికి అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు.శనివారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేటు లోని తన చాంబర్లో అవినీతి నిర్మూలనపై అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవినీతి తీవ్రమైన నేరమని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ లంచం ఇవ్వకూడదని అన్నారు. లంచం తీసుకోవడం నేరమని అన్నారు. ప్రజలు ధైర్యంగా అవినీతి పై నిలదీయాలని సూచించారు.రియల్ హీరోస్ డు నాట్ పే బ్రయిబ్ , కరప్షన్ ఇస్ ఏ క్రైమ్, నాట్ ఏ షార్టకట్ , స్పీక్ అప్, స్టాండ్ తల్, స్టాప్ కరప్షన్ " వంటి సందేశాలతో కూడిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.ఎవరైనా అవినీతి ఘటనలను గమనించిన వెంటనే 1064 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని కోరారు. అవినీతి రహిత పాలనకు ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యతగా సమాజంలో పారదర్శకతకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో అవినీతి నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు రహస్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అవినీతి నిరోధక శాఖ అధికారులుడి.ఎస్.పి. కె. సుదర్శన్, ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# జిల్లాలో చివరి దశ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ ఉంటుంది.

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్6:** జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశలుగానిర్వహిం చబడుతున్న నేపథ్యంలో, మొదటి దశ పోలింగ్ పూర్తయిన గ్రామ పంచాయతీలకు వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) ఎత్తివేయబడదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.జిల్లాలో చివరి దశ ఎన్నికలు పూర్తయ్యే వరకు గ్రామీణ ప్రాంతాలన్నింటిలో ఎంసీసీ కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. మొదటి మరియు రెండవ దశల్లో ఎన్నికైన అభ్యర్థులు సహా ప్రజలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఎంసీసీ ఉల్లంఘించినట్లయితే, సంబంధితులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.తమ పరిధిలోని గ్రామపంచాయతీలలో ప్రజలకు చివరి దశ ఎన్నికలు పూర్తయ్యేవరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని అవగాహన కల్పించాలని రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# రెండేళ్లుగా మామీద ఏడ్వడం తప్ప చేసిందేమిటి?

### అసమర్థ పాలనతో ఎగిరెగిరి పడుతున్నావ్ రేవంత్

### సింఎం తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

**హైదరాబాద్, ప్రభాత సూర్య:** రెండేళ్లుగా కేసీఆర్ మీద, బీఆర్ఎస్ పార్టీ మీద పడి ఏడ్వడం తప్ప నువ్వు చేసిందేముంది రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిలదీశారు. ఈమేరకుసీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కనకపు సింహాసనం మీద కూర్చోబెట్టినంత మాత్రాన శునకం తన బుద్ధి మార్చుకోదని.. అలాగే రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి సీట్లో కూర్చోబెట్టినా వెనుకటి గుణం మార్చుకోడు, మార్చుకోలేడు అని విమర్శించారు. విజయోత్సవాలు అంటూ విచ్చలవిడిగా తిరుగుతూ, వికృతంగా మాట్లాడటం వల్ల చేయనివి చేసినట్లు అయిపోవని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అబద్ధాలు ప్రచారం చేసినంత మాత్రాన, వాస్తవాలు మరుగున పడిపోవని అన్నారు. కేసీఆర్ అందించిన సంక్షేమ ఫలాలు ప్రజలు మరిచిపోరని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని పచ్చి అబద్ధం చెబుతున్న రేవంత్ రెడ్డి.. 6,47,479 రేషన్ కార్డులు మంజూరు చేసింది అబద్ధమా అని ప్రశ్నించారు. గతంలో కార్డు మీద నాలుగు కేజీల బియ్యం మాత్రమే ఇస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం దాన్ని ఆరు కేజీలకు పెంచి, కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి ఇచ్చింది అబద్ధమా అని నిలదీశారు. నల్లగొండ ప్రజల మీద కక్ష కట్టింది ఎవరు, ఎస్ ఎల్ బీ సీ ప్రాజెక్టును నెవర్ ఎండింగ్ ప్రాజెక్టుగా డిజైన్ చేసింది ఎవరు? ప్రాజెక్టును పడావు పెట్టింది ఎవరు? బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 3892 కోట్లు ఖర్చు చేసి, 11.48 కిలోమీటర్ల సొరంగం పనులు పూర్తి చేసింది నిజం కాదా? ఈ లెక్కలు మీ ప్రభుత్వం దగ్గర లేవా? పదే పదే ఎందుకు అబద్దాలు చెబుతున్నారు రేవంత్ రెడ్డి అని నిలదీశారు. అనాలోచిత నిర్ణయాలు, నిర్లక్ష్యం, దుందుడుకు చర్యలతో ఇవాళ ఎస్ ఎల్ బీ సీని త్రిశంకు స్వర్గంలో పడేసింది మీరు కాదా అని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# దివ్యాంగులకు చేయూతనందించిన వీ టు హెల్ప్ యు సంస్థ



**చౌటుప్పల్.డిసెంబర్ 06. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మండల పరిధి జయశ్రీ ఫంక్షన్ హాల్ లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని సివియర్ డిసబిలిటీ వెల్ఫేర్ సొసైటీ కోఆర్డినేషన్లో వీ టు హెల్ప్ యు కర్నాటి శ్రవణ్ జ్యోత్స్న లు సమకూర్చిన నిత్యవసర సరుకులను చౌటుప్పల్ చుట్టూరా ఉన్న తీవ్ర వైకల్యం కలిగిన 50 మంది దివ్యాంగులకు ఒక్కొక్కరికి 2000 రూ.ల విలువైన సరుకులను వీ టు హెల్ప్ యు సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా దివ్యాంగులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సివియర్ డిసబిలిటీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కత్తుల బాలకృష్ణ దివ్యాంగుల సమస్యలను సంస్థ ప్రతినిధులకు వివరించారు. అనంతరం వీ టు హెల్ప్ యు ప్రతినిధి బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ.. కష్టపడుతూ సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసి తాము అందించిన ఈ సరుకులు తీసుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. వచ్చే సంవత్సరం ఇంకా పెద్ద మొత్తంలో సహాయం అందిస్తామని తెలిపారు. అలాగే అన్ని అవయవాలు చక్కగా ఉన్నవాళ్లే సరిగ్గా జీవించలేకపోతున్నారు అలాంటిది మిమ్మల్ని చూస్తే మీరే మాకు స్ఫూర్తి అనిపిస్తుందని ధైర్యంగా ముందుకు సాగాలనిపిస్తుందని మాట్లాడారు. చక్కటి భోజనం అందించి దివ్యాంగులందర్నీ ఆనందపరిచారు. ఈ కార్యక్రమంలో వి టు హెల్ప్ యు ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం దివ్యాంగుల అందరూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని ఎమ్మార్వో మీరాబాయి చేతుల మీదుగా జాతీయ జెండా ఊపి ఎమ్మార్వో ఆఫీస్ నుంచి తంగడపల్లి రోడ్డు వరకు దివ్యాంగుల హక్కుల కోసం ర్యాలీ నిర్వహించారు.

# ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

### డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య





**తుర్కయంజాల్,డిసెంబర్ 06, ప్రభాత సూర్య:** తుర్కయంజాల్ సర్కిల్ ఆఫీస్ ఆవరణలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి చైర్మన్ కొత్త కురుమ సత్తయ్య పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ప్రెసిడెంట్ చెక్క బాల్ నరసింహ, అంబేద్కర్ సంఘం జనరల్ సెక్రెటరీ గుడ్ల శ్రీనివాస్,వైస్ ప్రెసిడెంట్ కానపురం దాస్,బిజెపి రాష్ట్ర నాయకులు బచ్చిగళ్ళ రమేష్, తుర్కయంజాల్ మాజీ వార్డు సభ్యులు గుండ బాలరాజ్, నాయకులు మెత్తరి శంకర్,మైనార్టీ నాయకులు పైసల్ బాయ్ టిఆర్ఎస్ నాయకులు కొత్తకుర్మ శ్రీశైలం,తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థంగా, నిజాయితీగా ఓటు హక్కు వినియోగించుకోండి

### అదే మనం అంబేద్కర్ కు ఇచ్చే ఘన నివాళి

### ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి టి రాజేష్



ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి లోని ప్రభుత్వ గవర్నమెంటు ఐటిఐ లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతిని ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీ వర్గాల ప్రజలందరూ నిర్వహించవలసిన కార్యక్రమాన్ని ఆయన అన్నారు. కానీ నేడు అంబేద్కర్ అంటే కొందరి వాడని అపనమ్మకాన్ని ఈ సమాజంలో కలిగిస్తున్నారని ఆయన తెలిపారు. అంబేద్కర్ అంటే కొందరివాడు కాదు అందరివాడు, అంబేద్కర్ అంటే మాత్మ గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మన్మోహన్ సింగ్, ఎం.ఎన్.రాయ్ కంటే కూడా గొప్ప నాయకుడని, ఆయన పేదరికంలో పుట్టి చిన్నతనంలోనే అనేక అవమానాలు పడి ఆ రోజుల్లోనే పై చదువులు చదివి భారత రాజ్యాంగ నిర్మాతగా గొప్ప పేరు ప్రతిష్టలు పొందారని ఆయన తెలిపారు. అంబేద్కర్ తన జీవితంలో మొట్టమొదటిసారిగా భారత దేశంలో ప్రతి ఒక్కరికి ఉపయోగపడే ఒక హక్కుని సాధించాడు అదే ఓటు హక్కు అని ఆ ఓటు హక్కును సరైన సమయంలో ఒక ఆయుధం లాగా ఉపయోగించాలని ఈ సందర్భంగా రాజేష్ తెలిపారు. ఓటు హక్కును అమ్ముకోకుండా నిజాయితీతో ఓటు హక్కు వినియోగించుకోవాలని, లేదంటే ఓటు అమ్ముకొని బానిసలు అవుతారో ప్రజలే తెలుసుకోవాలని ఆయన ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి సతీష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మధు, ప్రణీత్, వరుణ్, పవన్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## మరోసారి అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తా. సర్పంచి అభ్యర్థి సుజాత సత్యం



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 6:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కొన్యాల గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి దానం పల్లి సుజాత సత్యం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రతి ఇంటికి తిరుగుతూ కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.గత ఐదు సంవత్సరాల కాలంలో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మన గ్రామానికి ఉత్తమ శానిటేషన్ స్వశక్తి అవార్డు వచ్చినట్లు ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.త్రాగు నీటి కోసం మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు.గ్రామంలో హై మాక్స్ లైట్లు ,బిగించామన్నారు.మరొక సారి అవకాశం ఇస్తే గ్రామాన్ని ఇంకా అభివృద్ధి చేస్తానన్నారు.కావున కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సత్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఎమ్మెల్యేకు శివాజీ నగర్ కాలనీ వాసుల వినతి



**తుర్కయంజాల్,డిసెంబర్ 06, ప్రభాత సూర్య:** మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి శివాజీ నగర్ కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సానుకూలంగా స్పందించి కాలనీ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే కాలనీలో 3000 గజాల పార్క్ స్థలం కబ్జాకు గురవుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా వారు కమిషనర్ తో మాట్లాడి దాన్ని వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని తెలిపారు.కాలనీ వాసులు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సత్యం గౌడ్,తిరుపతి రెడ్డి,సుధాకర్ రెడ్డి, యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలి... సర్పంచ్ సుబ్బమ్మ

గార్లదిన్నె, డిసెంబర్ 17(ప్రభాత సూర్య): గార్లదిన్నె మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సర్కిల్ నందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుబ్బమ్మ మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు అదేవిధంగా మన దేశానికి రాజ్యాంగాన్ని రాసి మనందరి జీవితాలు వెలుగులు నింపారని, ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప మండల ప్రజా అభివృద్ధి అధికారి గోపాల్, పెద్దన్న పంచాయతీ డెవలప్మెంట్ అధికారి ఖాదర్ వలీ కంప్యూటర్ ఆపరేటర్ వేణుగోపాల్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

## బీజేపీ అభ్యర్థులను ఓడించాలి,లౌకిక శక్తులను గెలిపించండి

### సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పిలుపు



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 6:** సంగారెడ్డి జిల్లాలో ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న సిపిఎం బలపరిచిన అభ్యర్థులను సర్పంచ్ లుగా పంచాయతీ సభ్యులుగా గెలిపించాలని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులను ఓడించాలని ,లౌకిక ప్రజా తంత్ర శక్తులను గెలిపించాలని అన్నారు.సదాశివపేట్ మండల కేంద్రంలో ఈ రోజు జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సదాశివపేట్ మండలలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న సిపిఎం అభ్యర్థులను పంచాయతీ సభ్యులుగా ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో సిపిఎం అనేక పోరాటాలు నిర్వహించిందని పోరాటాల ఫలితంగానే భూ నిర్వాసితులకు నష్టపరిహారం డబ్బులు పలుచోట్ల అందాయని అన్నారు. ఇండ్లు ఇళ్ల స్థలాలు భూ సమస్యల స్థానిక సమస్యలపై సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉపాధి కూలీల కోసం,స్థానిక సమస్యల పరిష్కారం కోసం సిపిఎం బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే రెట్టింపు ఉత్సాహంతో సమస్యల పరిష్కారం కోసం పనిచేయడానికి అవకాశం ఇచ్చినట్లు అవుతుందని ఆయన అన్నారు. డబ్బు మద్యం ప్రలోభాలకు గురి చేస్తున్న నాయకులను గుర్తించి వారికి తగు బుద్ధి చెప్పాలని ప్రజల కోసం నిరంతరం పనిచేసే వారిని గ్రామ సర్పంచ్ వార్డు సభ్యులుగా ఎన్నుకోవాలని అప్పుడే గ్రామ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. మండలం లో సిపిఎం తరపున పోటీ చేస్తున్న వార్డ్ సభ్యులను గెలిపించాలని సిపిఎం మండల కార్యదర్శి ప్రవీణ్ కుమార్ పిలుపు ఇచ్చారు. ఈ సన్నాహక సమావేశంలో సిపిఎం నాయకులు రమేష్ గౌడ్, భూషణం, ఏషోబు, నర్సిములు, మహేష్,కయ్యూం, ఆంజనేయులు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు నివాళులు

## బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ

**తుర్కయంజాల్,డిసెంబర్ 06, ప్రభాత సూర్య:** బాబా సాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి మల్లెల రఘు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అంబేద్కర్ నిష్క్రమణ భారత దేశానికి తీరని లోటు భారత రాజ్యాంగం అమలులోకి రాకముందు చదువుకు అధికారానికి నోచుకోలేదో ఆ వర్గాల గొంతుక మూగ బోయినట్లయింది అంబేద్కర్ తన జీవిత కాలం అంతయు తనకోసం తన కుటుంబాన్ని కూడా వదులు కొని ఈ బడుగు బలహీన వర్గాలే తన కుటుంబం గా భావించి వారి యొక్క హక్కుల కోసం పోరాటం చేసి భారత రాజ్యాంగం లోని ఓటు హక్కు ద్వారా వారిని రాజులుగా చేశాడు ఈ భూమి మీద మనుషులు బ్రతికే ఉన్నంత కాలం అంబేద్కర్ పేరు సజీవంగా ఉంటుందన్నారు. ఇప్పటికైన బడుగు బలహీన వర్గాలు ఓటు హక్కును,భారత రాజ్యాంగాన్ని తెలుసుకొని బిఎస్పి జెండా క్రింద అధికారం వైపు పయనించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు వద్దిగళ్ళ బాబు, ఉపాధ్యక్షులు లపంగి రాజు, సోషల్ మీడియా కన్వీనర్ ఏర్పుల రవి కుమార్,ఇంజాపూర్ వార్డు అధ్యక్షులు మీసాల రవి కుమార్,సీనియర్ నాయకులు భూతం రమణ,యడవల్లి శ్యామ్ కుమార్,కొమ్మని దర్శన్,గుడ్ల శ్రీనివాస్,గుర్రం మురళి,రమేష్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ పార్టీలో చేరిక బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు సూరపల్లి గణేష్ నేత

**సంస్థాన్ నారాయణపురం,డిసెంబర్ 06( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు సూరపల్లి గణేష్ నేత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్ఫూర్తి కళాశాల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాపర్తి సురేష్ గౌడ్ మాట్లాడుతూ నారాయణపురం అభివృద్ధి ధ్యేయంగా సిపిఐ పార్టీ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉప్పల విజయలక్ష్మి-లింగస్వామి గెలుపుకై పూర్తి మద్దతు తెలుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుత్త ఉమా ప్రేమ్చందర్ రెడ్డి, నారాయణపురం మండల అధ్యక్షులు కరెంటోత్ శ్రీను నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉప్పల లింగస్వామి, రాచకొండ రమేష్ బాబు,రాపర్తి సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ కు ఘన నివాళి

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 6:** హత్నూర మండలం ముచ్చర్ల గ్రామంలో భారతరత్న ప్రపంచ మేధావి సామాజిక ఉద్యమకారులు విప్లవ నేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకొని తెలంగాణ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పూల మాలలతో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పాల్గొన్న తుర్కల ఖానాపూర్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు సామాజిక ఉద్యమ నాయకుడు మీనంపల్లి కిషన్ రావు పాల్గొని అంబేద్కర్ కు నివాళులర్పించి పూలమాల లు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యావేత్త సామాజిక ఉద్యమ విప్లవ నేత అనగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు మరువలేనివి అని అన్నారు. దేశం 78 ఏళ్లుగా సుభిక్షంగా వర్ధిల్లుతుందనడానికి అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే ఇందుకు నిదర్శనం అన్నారు. కొందరు ఈ మధ్య భారతరాజ్యాంగానికి తూట్లు పొడువాలని కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాహక్కుల పరిరక్షణ సమితి నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు మీనంపల్లి శ్రీశైలం,పాఠశాల విద్యాకమిటి మాజీ చైర్మెన్ తాలుక సుధాకర్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు తాలుక పెంటేష్, సీహెచ్ ఎల్లేష్, సయ్యద్ సాజిద్,,టి చందు, ఎం విజయ్, సీహెచ్ కార్తీక్,నాయకులు ఎం ప్రభాకర్, టి యాదయ్య, సీహెచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.







# తల్లిదండ్రుల స్మరణలో సేవా తర్పణం

## దిగ్విజయంగా 25వ వారం అన్నసమారాధన

## 125 మందికి కంటి పరీక్షలు.. 900 మందికి అన్నదానం

## సేవలో ఉన్న సంతృప్తి ఎందులోనూ లేదు: రాహుల్ ప్రదీప్





**కూకట్‌పల్లి, డిసెంబర్ 06 (ప్రభాత సూర్య) :** జన్మనిచ్చిన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆకలిగొన్న వారికి అన్నం పెట్టడం, చూపు మందగించిన వారికి వెలుగునివ్వడం ఎంతో సంతృప్తినిస్తోందని, అమ్మానాన్నల పేరుతో చేస్తున్న ఈ సేవలో ఉన్న ఆనందం మరెందులోనూ లేదని మైత్రి కన్‌స్ట్రక్షన్స్ ఎండీ, సీనియర్ జర్నలిస్ట్ దాసరి రాహుల్ ప్రదీప్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు కీ.శే. దాసరి శ్రీనివాస్ రావు, ప్రసన్న జ్ఞాపకార్థం ఆయన చేపట్టిన సేవా యజ్ఞం శనివారంతో 25వ వారానికి చేరుకుంది. కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ భాగ్యనగర్ కాలనీలోని జేసీ బ్రదర్స్ వెనుక ఉన్న ప్రాంగణంలో నిర్వహించిన 25వ వారం అన్నసమారాధన, ఉచిత కంటి వైద్య శిబిరం దిగ్విజయంగా ముగిశాయి. గ్లోబల్ ఐ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి జరిగిన ఈ శిబిరంలో సుమారు 125 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ తిరుమలరావు, గ్లోబల్ హాస్పిటల్ సెంట్రల్ హెడ్ మాధవి చౌదరి పర్యవేక్షణలోని వైద్య బృందం ప్రజలకు సమగ్ర పరీక్షలు చేసి, దృష్టి లోపాలు, గ్లాకోమా వంటి సమస్యలను గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు తగు వైద్య సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో దాదాపు 900 మందికి పైగా పాల్గొని భోజనం చేశారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను స్మరించుకుంటూ, సాటివారికి సాయపడాలని రాహుల్ ప్రదీప్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు, వయోజనులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సేవా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

# డాక్టర్ బిఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో మనువాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం, భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

## కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు



**భువనగిరి, డిసెంబర్ 07(ప్రభాత సూర్య):** డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి స్ఫూర్తితో మనువాదానికి వ్యతిరేకంగా పోరాడుదామని , భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా , కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి అన్నంపట్ల కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం రోజున కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహానికి వారి 69వ వర్ధంతి ొందర్భంగా పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించి, శ్రద్ధాంజలి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు స్వాతంత్ర%శీ% వచ్చి 78 ఏండ్లు దాటినా నేటికీ రాజ్యంగా ఫలాలు దళిత, గిరిజనులకు , పేదలకు సరిగా అందడం లేదని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని ప్రైవేట్ శక్తులకు కారు చౌకగా అమ్మేసి రిజర్వేషన్ లేకుండా చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్స్ కల్పించాలని డిమాండ్ చేసినారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమాలకు సిద్దం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో బిజెపి పాలనలో దళితులపైన దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగి పోయాయాని ఆవేదనా వెలిబుచ్చారు. ఈ దాడులకు వ్యతిరేకంగా డాక్టర్ బిఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో పోరాడాలని అన్నారు. నాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయం కోసం, కుల అసమానతులకు వ్యతిరేకంగా పేదలకు, దళితులకు భూమి, పరిశ్రమలు జాతీయం చేయాలని పిలుపునిచ్చారని తెలిపారు. నేటికీ దళితులు సెంటు భూమికి నోచుకోని కుటుంబాలు వేలాదిగా ఉన్నాయని అన్నారు. రానున్న కాలంలో భూమికోసం, కుల నిర్మూలన కోసం పోరాటాలకు మనమందరం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇంకా కార్యక్రమంలో కాసగళ్ళ చందు, పల్లెపాటి మాతయ్య, వినోద్, వెంకటేష్ , రాజు తదితరులు పాల్గొన్నారు.





## మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం వర్కల చందు ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ



**గండిపేట. : సూర్య ప్రతినిధి:** అయ్యప్ప నామస్మరణతో పద్మశాలిపురం ప్రాంతం శనివారం మారుమోగింది. వర్కల చందు ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భజన మండలి స్వాములు భక్తిగీతాలను ఆలపించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలు, ఆల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరి గురు స్వామీ, సంతోష్ గౌడ్ గురు స్వామి,మహేష్ రాజ్ స్వామి,లక్ష్మారెడ్డి స్వామి,నరేందర్ స్వామి,శంకర్ స్వామి, స్వాములు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.......


## ఘనంగా నివాళులు అర్పించిన టీయూడబ్ల్యూజే నాయకులు....

చందానగర్ ప్రభాత సూర్య : శేరిలింగంపల్లి నియోజకవర్గం:



**డా.బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ గారి 68వ వర్ధంతిని పురస్కరించుకుని, శేరిలింగంపల్లి నియోజకవర్గం, చందానగర్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (TUWJ) రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా పాల్గొన్నారు. ఆయన అంబేద్కర్ గారి చిత్రపటానికి, విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జాయింట్ సెక్రటరీ షకీల్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా సెక్రటరీ విజయ్ కుమార్తో పాటు, జర్నలిస్టులు, షఫీ, ప్రవీణ్, శశికాంత్, ప్రవీణ్ కుమార్, యాసీన్, నర్సింహా సాగర్ తదితరులు ఉన్నారు. వీరందరూ డాక్టర్ అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు.....

## అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న 3000 మంది



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్న ప్రసాద భోజన కార్యక్రమం 161 పూర్తి చేసుకుంది. 161 వ శనివారం అన్మదాన కార్యక్రమంలో సుమారు 3000 వేల మంది పాల్గొన్నారు. హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం చేపడుతున్న అన్నదానం కార్యక్రమం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. నిత్యం పనులు చేసుకుంటూ జీవనం గడిపే తమకు ప్రతి వారం ఉచిత భోజనం అందజేయడం పట్ల హెూప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ కు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెూప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం భట్టితో సినీ ప్రముఖుల భేటీ

## తెలంగాణ రైజింగ్‌పై చిరు,నాగ్‌లతో చర్చ

**హైదరాబాద్, ప్రభాత సూర్య:** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో సినీ నటులు చిరంజీవి, నాగార్జునలతో పాటు పలువురు ప్రముఖులు శనివారం ప్రజాభవన్‌లో సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై భట్టితో చర్చించారు. ఈ సందర్భంగా గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని వారిని భట్టి విక్రమార్క ఆహ్వానించారు. తప్పకుండా వస్తామని చిరంజీవి, నాగార్జున చెప్పినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో సినీ రంగంపై ప్రత్యేక చర్చ జరగనుంది. సినీ రంగంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో తెలంగాణను మొదటి స్థానంలో నిలపాలన్న లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం.. ఈ నెల 9న జరిగే సదస్సులో 'వన్ కంట్రీ - మెనీ సినిమాస్' పేరుతో ప్యానల్ డిస్కషన్స్ చేయాలని నిర్ణయించింది. ఈ చర్చలో ప్రముఖ దర్శకుడు సుకుమార్‌తో పాటు బాలీవుడ్ నటీనటులు జెనీలియా, రితేశ్ దేశ్‌ముఖ్ దంపతులు, అర్జున్ కపూర్, అనిరుధ్ రాయ్, పార్వతీ గోయెల్, అసిఫ్ అలీ, ప్రియదర్శన్‌లు పాల్గొంటారు. పలువురు నిర్మాతలు, దర్శకులు, ఓటీటీ సంస్థల ప్రతినిధులు, ఇతర సినీ ప్రముఖులు హాజరై తమ అనుభవాలను, అభిప్రాయాలను పంచుకుంటారు. ఫిల్మ్ ఇన్ తెలంగాణ పేరుతో సినిమాల నిర్మాణం, చిత్రీకరణ లొకేషన్లు సహా సదుపాయల కల్పనపై చర్చించనున్నారు. అనంతరం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రైసింగ్ సమ్మిట్ అనేది ఒక ఎకానిమిక్ సమ్మిట్ అని వివరించారు. ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైసింగ్ సమ్మిట్ నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ అంత కలిసి కూర్చొని విజన్ డాక్యుమెంట్ రూపొందించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని సాధించడానికి ఈ విజన్ డాక్యుమెంట్ తయారు చేశామని వెల్లడించారు. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 1:30 నిమిషాలకు తెలంగాణ రైసింగ్ సమ్మిట్ ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పుకొచ్చారు. తెలంగాణ రైసింగ్ సమ్మిట్‌లో వివిధ దేశాల నుంచి వచ్చే ప్రముఖ ఎకానమిస్ట్‌లు ప్రసంగిస్తారని తెలిపారు. అలాగే తనతో పాటు మంత్రి శ్రీధర్ బాబు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం అనేక ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సెషన్స్ ఉంటాయని వివరించారు. ఆయా డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన కార్యక్రమాలను మంత్రులు చూసుకుంటారని చెప్పుకొచ్చారు. తెలంగాణ రైసింగ్ సమ్మిట్‌లో అనేక మంది ఎక్స్‌పర్ట్స్ పాల్గొంటారని వివరించారు. 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు క్లోసింగ్ సెర్మనీ ఉంటుందని తెలిపారు. ఈ సెర్మనీలో ఎవరెవరు పాల్గొంటారనే విషయాన్ని ఓ ప్రకటన ద్వారా మళ్లీ తెలియచేస్తామని తెలిపారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌కు 44 దేశాల నుంచి 154 డెలిగేట్స్ వస్తున్నారని వివరించారు. అమెరికా నుంచే 46మంది ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు. తెలంగాణ రైసింగ్ సమ్మిట్‌కు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. స్వయంగా అధికారులు వెళ్లి ఆఫీషియల్‌గా పిలుస్తారని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# షామీర్ పేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ..డ్రైవర్ మృతి

**హైదరాబాద్, ప్రభాత సూర్య:**మేడ్చల్ జిల్లా శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అలియాబాద్ చౌరస్తా దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అలియాబాద్ నుంచి శామీర్ పేట వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను శామీర్ పేట నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ట్రాక్టర్ అదుపు తప్పి రాంగ్ రూట్‌లోకి వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మహారాష్ట్రకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆకాష్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద ధాటికి ట్రాక్టర్ ఇంజన్ రెండు ముక్కలైంది. ఈ ప్రమాదంతో రాజీవ్ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇరువైపుల కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహయక చర్యలు చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాక్టర్?ను క్రేన్ సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్?ను క్లియర్ చేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# గుత్తాధిపత్యంలో విమానయాన సంస్థ

## అందుకే ఇండిగో విమానాల ప్రతిష్టంభన

## ఇండిగోను ఏమీ చేయలేని దుస్థితిలో కేంద్రం

## తాజా పరిస్థితులపై కెటిఆర్ వెల్లడి

**హైదరాబాద్, ప్రభాత సూర్య:**దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గత ఐదు రోజుల నుంచి ఎయిర్‌పోర్టులు అన్ని రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల కంటే అధ్వాన్నంగా మారిపోయాయని విమర్శించారు. కొంతమంది చేతుల్లోనే శక్తి కేంద్రీకృతమైతే జరిగే దుష్పరిణామాలకు ఇది గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇండిగో విమానాలను ఆపేయడంతో ఎయిర్‌పోర్టుల్లో వేలాది మంది తన్నుకునే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఇండిగో ఎందుకు బంద్ పెట్టిందో కారణాన్ని ఆయన వివరించారు. శ్రమ దోపిడీ చేయవద్దని.. పైలట్లు వారానికి ఇంత సమయం మాత్రమే విమానాలు నడపాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఏడాది కింద ఒక రూల్ తీసుకొచ్చిందని తెలిపారు. కానీ దేశంలోని విమానయాన శాఖ మొత్తం ఇండిగో, ఎయిరిండియా చేతుల్లోనే ఉందని.. దీంతో ఏడాది కింద కేంద్ర ప్రభుత్వం రూల్ తీసుకొచ్చినప్పటికీ వాళ్లు మారలేదని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయం కూడా ఏర్పాటు చేసుకోలేదని చెప్పారు. దీనివల్ల ఒక్కరోజే ఇండిగో సంస్థ వెయ్యి విమానాలు రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. ఆ దెబ్బతో ఎయిర్‌పోర్టులు అన్ని అధ్వాన్నంగా తయారయ్యాయని చెప్పారు. ఎయిర్‌పోర్టులు బస్టాండ్లలా మారిపోయాయని విమర్శించారు. విమానయాన శాఖ మొత్తం ఇద్దరి చేతుల్లోనే ఉండటంతో కేంద్ర ప్రభుత్వమే తగ్గాల్సి వచ్చిందని కేటీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం రూల్ తీసుకొచ్చినప్పటికీ.. ఇండిగో సంస్థ తన నిర్ణయాన్ని మార్చుకోలేదని తెలిపారు. తప్పు చేశానని ఒప్పుకోలేదని.. అయినప్పటికీ వారికి ఫైన్ వేసే దమ్ము లేదని అన్నారు. చివరకు కేంద్ర ప్రభుత్వమే తగ్గి గతంలో ఇచ్చిన రూల్‌ను వెనక్కి తీసుకుందని.. విమానయాన కంపెనీలకు కొంత సమయం ఇచ్చిందని పేర్కొన్నారు. కొంతమంది చేతుల్లోనే శక్తి ఉంటే జరిగే దుష్పరిణామాలకు ఇదొక గొప్ప ఉదాహరణ అని తెలిపారు.

# గట్టుప్పల్ మండలంలో ఎన్నికల శిక్షణ & అవగాహన సమావేశాలు



గట్టుప్పల్: ప్రభాత సూర్య 06: గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గట్టుప్పల్ మండలంలో రెండు ముఖ్యమైన కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించబడ్డాయి. మొదటగా, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో ప్రీసైడింగ్ అధికారులకు, స్టేజ్-2 అధికారులకు ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణను మాస్టర్ ట్రైనర్స్ శంకర్ టీచర్, వెంకటేశ్వర్లు సమగ్రంగా అందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కూడా పాల్గొన్నారు. తరువాత, అదే రోజు సాయంత్రం ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థుల కోసం ఎన్నికల అవగాహన సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో గట్టుప్పల్ మండలం ఎన్నికల వ్యయ నియంత్రణ అధికారి టి. రేణుక ఎన్నికల నియమాలు, వ్యయ నిబంధనలు, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమానికి గట్టుప్పల్ తహసీల్దార్ రాములు పాల్గొని అభ్యర్థులకు సూచనలు అందించారు. కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి.

# శివన్నగూడెంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**మర్రిగూడ ప్రభాత సూర్య 6:** శివన్నగూడెం గ్రామంలో భారత రాజ్యాంగ రూపశిల్పి, మహానుభావుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని గ్రామ ప్రజలు శనివారం ఘనంగా నివాళులు అర్పించారు. గ్రామ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి స్థానిక నాయకులు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు కలిసి పూలమాలలు వేసి ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, అంబేద్కర్ చూపిన సమానత్వం, న్యాయం, విద్య, స్వాభిమానం మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. శోషణ రహిత సమాజ నిర్మాణానికి ఆయన చూపిన దారి ఇప్పటికీ మార్గదర్శకమని గుర్తుచేశారు. గ్రామ యువత అంబేద్కర్ ఆశయాలనే ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆకారపు సంజీవ, లోడ యాదయ్య, ఊరిపక్క సందీప్, గుర్రం నరసింహ, బోయిని యాదయ్య, మల్లం కిరణ్, లోడ కృష్ణ, వేణు, ఊరిపక్క శరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మహానటి సావిత్రికి మరణం లేదు

## చిత్ర పరిశ్రమలో ఆమె చరిత్ర చిరస్థాయి

## అలాంటి నటులు నేడు లేరు..రారు

## మంచి సినిమాలు తీస్తే అంతా ఆదరిస్తారు

## సావిత్రి మహోత్సవంలో వెంకయ్యనాయుడు

**హైదరాబాద్, ప్రభాత సూర్య:**మహానటి సావిత్రికి మరణం లేదని, ఆమె చరిత్ర అజరామరమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. చిత్రపరిశ్రమ ఉన్నంత వరకు ఆమె జీవిస్తూనే ఉంటుందని అన్నారు. 'మహానటి' సావిత్రి 90వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఆయన అనేక విషయాలపై మాట్లాడారు. మహానటిగా ప్రేక్షకాభిమానం సొంతం చేసుకున్న సావిత్రి 90వ జయంతి సందర్భంగా ఆమెకు నివాళి అర్పిస్తున్నా. 'సావిత్రి మహోత్సవం' అని ఈ కార్యక్రమానికి మంచి పేరు పెట్టారు. సావిత్రి జీవితం నుంచి ఎన్నో విషయాలు నేటితరం నేర్చుకోవచ్చు. నటిగా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమాజ శ్రేయస్సు కోసం ఆమె పాటుపడ్డారు. కంటితో కోటి భావాలు, నవరసాలు పలికించే ఆమె నటన అద్భుతం అన్నారు. ప్రస్తుతం అలాంటి నటీమణులు లేరు. ఈ విషయం చెప్పడానికి నాకు ఏ సంకోచం లేదు. నేటి సినిమాల్లో కథానాయికకు ప్రాధాన్యం తగ్గిపోతోంది. కుటుంబ విలువలు ఉన్న సినిమాలు రావడం లేదు. అభినయం ప్రదర్శించే కథానాయికలను వేళ్ల మీద లెక్క పెట్టి



చెప్పవచ్చు. ప్రస్తుతం ఒకరిద్దరు అలాంటి నటీమణులు ఉన్నా, వారికి తగిన అవకాశాలు రావడం లేదు. సినీ ప్రముఖులు ఈ దిశగా ఆలోచించాలని వెంకయ్యనాయుడు సూచించారు. అలాగే మంచి సినిమా తీస్తే తనతో సహా అందరూ ఆదరిస్తారని, ఈ ప్రపంచంలోనే అత్యంత చవకైన వినోదం సినిమా మాత్రమేనని వెంకయ్యనాయుడు అన్నారు. తెలుగు సాహిత్యంలో ఉన్న ఎన్నో కథలను దర్శక-నిర్మాతలు ధారావాహికల రూపంలో నేటి తరానికి అందించాలని కోరారు. ఈటీవీ విన్ 'కథాసుధ' పేరుతో చేస్తున్న ప్రయత్నాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సినిమా వ్యాపారమే అయినా, అది కళాత్మకమని నిర్మాతలు గుర్తు పెట్టుకోవాలన్నారు.. 'మహానటి' మూవీని అద్భుతంగా తీశారు. అశ్వనీదత్ కుమార్తెలు, ఆయన అల్లుడు నాగ్ అశ్విన్‌కు నా అభినందనలు. ఆ సినిమా చూస్తుంటే పాత రోజులన్నీ గుర్తు వస్తాయి. ప్రతి నిర్మాత ఇలాగే ఆలోచించాలి. మనవైన కథలు ఎన్నో ఉన్నాయి. మంచి సినిమా ఉంటే నాతో సహా అందరూ చూస్తారు. దగ్గుబాటి రానా నిర్మించిన '35: చిన్న కథ కాదు', దిల్‌రాజు కుమార్తె హన్షిత నిర్మించిన 'బలగం', కొణిదెల నిహారిక 'కమిటీ కుర్రాళ్ళు', సుకుమార్ కుమార్తె సుక్రీతి 'గాంధీతాత చెట్టు' ఇలా ఎన్నో చిత్రాలు ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకోవడంతో పాటు, అవార్డులు సొంతం చేసుకున్నాయన్నారు. మన జీవనంలో అత్యంత చౌకగా లభించే వినోదం సినిమా. అప్పటి సినిమాల్లో హీరో-హీరోయిన్ ఒకరినొకరు తాకకుండా శృంగారాన్ని పండించేవారు. ఇప్పుడు తాకిన, గోకినా ఏం జరగడం లేదు. అంత తేడా వచ్చేసింది. సావిత్రిలాంటి నటికి మరణం లేదు. ఆమె మంచితనం కూడా చిర యశస్సు అందించింది. సినిమా వినోదం పాటు, సందేశానికీ ప్రాముఖ్యత ఇవ్వాలి. సందేశాత్మక సినిమాలు ఎవరు చూస్తారని అందరూ అనుకుంటున్నారు. రామోజీరావుగారు తీసిన సందేశాత్మక సినిమాలు ఆడలేదా? నేటి దర్శక-నిర్మాతలు ఆ అభిప్రాయాన్ని మార్చుకుని, కళాత్మక సినిమా తీయాలని కోరుకుంటున్నాఅని వెంకయ్యనాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో తనికెళ్ల భరణి తదితర నటులు, సావిత్రి కూతురు విజయచాముండేశ్వరి పాల్గొన్నారు.

# సాగు విస్తీర్ణం ఆధారంగాయూరియా పంపిణీ!

## కీలక నిర్ణయం దిశగా తెలంగాణ ప్రభుత్వం!

## సాగు లెక్కల కోసం ప్రత్యేక యాప్ అభివృద్ధి

**హైదరాబాద్, ప్రభాత సూర్య:** వానాకాలం సాగు సమయంలో తెలంగాణలో యూరియా కోసం రైతుల ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. బస్తా యూరియా కోసం గంటల కొద్ది కిలోమీటర్ల మేర క్యూలైన్లలో నిల్చున్నారు. యూరియా కొరతపై ఇటు విపక్షాల నుంచే కాక ప్రజలు కూడా ప్రభుత్వం మీద తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ఇక విపక్షాలు అయితే ప్రభుత్వ అసమర్థత వల్లే కేంద్రం రాష్ట్రానికి సరిపడా యూరియాను సరఫరా చేయలేదని దుమ్మెత్తిపోశాయి. ఈ క్రమంలో యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈసారి యూరియా కొరత లేకుండా, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు గాను తెలంగాణ వ్యవసాయ శాఖ కఠిన చర్యలు తీసుకోవడానికి రెడీ అవుతోంది. దీనిలో భాగంగా ఈ సారి నుంచి సాగు విస్తీర్ణం ప్రకరమే యూరియా పంపిణీ చేయనున్నారు. అంటే రైతులు ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు అనే వివరాల ఆధారంగానే యూరియా పంపిణీ జరగబోతుంది. దీనికోసం రైతుల పట్టాదారు పాస్‌బుక్కుల నుంచి వివరాలు సేకరించి.. ఎంత యూరియా అవసరమో లెక్కలు తేల్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రైతులు తాము సాగు చేసే పొలం విస్తీర్ణం కంటే ఎక్కువ యూరియా తీసుకోకుండా ప్రత్యేక యాప్‌ని అభివృద్ధి చేస్తున్నారు. గత నెల నుంచి ఆధార్ లింకుతో ఈ-పాస్ యంత్రాల ద్వారా యూరియా, ఇతర మందుల అమ్మకాలు జరుగుతున్నాయి. రైతుకు ఉన్న భూమికి ఎంత యూరియా అవసరమో అంతే తీసుకునేలా చర్యలు చేపట్టారు. దీని వల్ల.. అధికారులను తప్పుదోవ పట్టించి బ్లాక్‌లో అమ్మడం కోసం.. ఎక్కువ యూరియా తీసుకుంటే దొరికిపోతారు. దీని వల్ల బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయవచ్చని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్‌కు 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అవసరమని కేంద్రానికి లేఖ రాసింది. ఈ నెలాఖరు వరకు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని కోరింది. అయితే, ఇప్పటివరకు రెండు నెలలకు సంబంధించిన యూరియా నిల్వల్లో సగం మాత్రమే రాష్ట్రానికి వచ్చిందని వ్యవసాయ శాఖ తెలిపింది.

# జనసేనలోకి హేమ

సినీ పరిశ్రమకు చెందిన చాలామంది వ్యక్తులు రాజకీయాల్లో రాణించారు. అయితే అందులో సక్సెస్ అయిన వారు కొంతమందే. ఆర్కే రోజా రాజకీయాల్లోకి వచ్చి మంత్రి స్థాయికి ఎదిగారు. ఆపై పవన్ కళ్యాణ్ సైతం ఈ రాష్ట్రానికి డిప్యూటీ సీఎం అయ్యారు. మెగా బ్రదర్ నాగబాబు సైతం ఎమ్మెల్సీ అయ్యారు. వైసీపీ హయాంలో పోసాని కృష్ణ మురళి, అలీ, 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్ తదితరులు నామినేటెడ్ పదవులు అనుభవించారు. అయితే చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన వ్యక్తులు వివాదాస్పద ముద్రను చాటుకున్నారు. అయితే కొంతమంది ఇలా వచ్చి అలా మళ్లీ సినీ పరిశ్రమలోకి వెళ్ళిపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్, నటిగా గుర్తింపు తెచ్చుకున్న హేమ రాజకీయాల్లోకి వస్తారని తెలుస్తోంది. ఇటీవల తన మనసులో ఉన్న మాటను కూడా ఆమె బయటపెట్టారు. డ్రగ్స్ కేసులో ఇరుక్కుని.. కామెడీ పరంగా కూడా చాలామంది మహిళ నటీమణులు రాణించారు. అందులో హేమ కూడా ఒకరు. గత కొంతకాలంగా ఆమె సినిమాల్లో పెద్దగా కనిపించడం లేదు. డ్రగ్స్ కేసులో ఇరుక్కున్నారు. జైలుకు కూడా వెళ్లారు. ఇటీవల ఆమెకు క్లీన్ చీట్ లభించింది. అయితే ఇప్పుడు ఆమె మూవీ ఆర్ట్స్ అసోసియేషన్ కు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించేందుకుగాను పవన్ కళ్యాణ్ ను కలుస్తానని చెబుతున్నారు. పనిలో పనిగా తన రాజకీయ ఆసక్తి, తన అభిలాషను సైతం పవన్ కళ్యాణ్ కు వివరిస్తానంటున్నారు. త్వరలో జనసేనలో చేరుతానని కూడా హింట్ ఇస్తున్నారు. అయితే ఆమెను జనసేనలోకి తీసుకుంటారా? లేదా? అన్నది చూడాలి. నటిగా గుర్తింపు.. గోదావరి ప్రాంతాలకు చెందిన హేమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా సినీ పరిశ్రమలో అడుగుపెట్టి తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. కామెడీ టైమింగ్ ఉన్న నాటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే 2014 ఎన్నికల్లోనే ఆమె రాజకీయాల్లోకి వచ్చారు. సమైక్యాంధ్ర ఉద్యమ పార్టీ నుంచి పోటీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు చివరి ముఖ్యమంత్రిగా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి ఆ పార్టీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో గోదావరి జిల్లాలో ఓ నియోజకవర్గంలో నుంచి పోటీ చేసిన హేమ నాలుగువేల వరకు ఓట్లు సొంతం చేసుకున్నారు. అయితే తర్వాత ఆమెకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి సైతం ఆఫర్లు వచ్చినట్లు తెలుస్తోంది. కానీ ఆమె మాత్రం జనసేనలో చేరుతారని ప్రచారం అన్నది సాగుతోంది. తనకు టీటీడీ బోర్డు మెంబర్ గా ఆసక్తి ఉందని ముందుగానే ప్రకటించుకున్నారట హేమ. చూడాలి ఆమె జనసేనలో చేరుతారా? లేదా? అన్నది.



# సెకండ్ కోసం కమలం కసరత్తు



తెలంగాణ సర్పంచ్ ఎన్నికలపై అన్ని పార్టీలు సీరియస్‌గా ఫోకస్ పెట్టాయి. రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలవాలంటే గ్రామాల్లో బలంగా ఉండాలని..సర్పంచ్ ఎన్నికల్లో అప్పర్ హ్యాండ్ కోసం అధికార కాంగ్రెస్.. ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. అయితే బీజేపీ కూడా తామేం తక్కువ కాదంటోంది. కాంగ్రెస్‌కు ఆల్టర్నేట్ తామేనని చెప్తున్న కమలనాథులు..సర్పంచ్ ఎన్నికల్లో దాన్ని ప్రూవ్ చేయాలని భావిస్తున్నారట.బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించి..2028 ఎన్నికలే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారట. ఇప్పటినుంచే కార్యాచరణ సిద్ధం చేసి వాటి అమలుకు నాయకులు సంసిద్ధంగా ఉండాలని డైరెక్షన్స్ ఇచ్చారట. లోకల్ బాడీ ఎన్నికల్లో సత్తా చాటితేనే..పార్టీని బూత్ లెవల్‌కు తీసుకెళ్లగలుగుతామని..అందుకోసం సర్పంచ్ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారట.తెలంగాణలో బీజేపీకి ఎనిమిది మంది లోక్‌సభ, ఇద్దరు రాజ్యసభ సభ్యులు, ఏడుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల్లో బీజేపీ వాటా అంతంత మాత్రమే. ఇప్పటికీ ఆ పార్టీకి సంస్థాగత నిర్మాణం అంత స్ట్రాంగ్‌గా లేదు. అయినా మోదీ వేవ్..బీఆర్ఎస్ క్యాడర్ ఓటమి నైరాశ్యంతో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 8 సీట్లు వచ్చాయన్న చర్చ ఉంది. అయితే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడినప్పటి నుంచి కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయమని..రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని చెప్పుకుంటున్నారు కమలనాథులు.కాంగ్రెస్‌కు ఆల్టర్నేట్ బీజేపీ అని ప్రూవ్ చేసుకోవాలంటే సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూములుగా అయితే లోకల్ బాడీ ఎన్నికల ఫలితాలు అధికార పార్టీకి అనుకూలంగా వస్తుంటాయ్. అయినప్పటికీ బీజేపీ ఈ స్థానిక ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందట. అధికార కాంగ్రెస్‌కు ఆల్టర్నేట్ తామేనని చెప్పుకోవాలంటే బీజేపీ మద్దతుదారులను నిలబెట్టాలని అనుకుంటున్నారట. అంతే కాకుండా బీఆర్ఎస్‌ను ఓవర్ కమ్ చేసి రెండో ప్లేస్‌లో నిలవడం ద్వారా వచ్చే ఎన్నికల్లో విజయం తమదేనని చెప్పుకొవాలనుకుంటున్నారట.సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఇప్పటికే బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు వారివారి నియోజకవర్గాల్లో కార్యాచరణను అమలు చేస్తున్నారట. ఇందులో భాగంగానే కేంద్రమంత్రి బండి సంజయ్ బీజేపీ మద్దతుదారులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే పది లక్షల నజరానా ప్రకటించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు నియోజకవర్గాల్లోనే తిష్టవేసి పార్టీకి కనీసం సెకండ్ ప్లేస్‌లో అయినా నిలవాలని భావిస్తున్నారట బీజేపీ లీడర్లు. సర్పంచ్ ఎన్నికలు పార్టీ గుర్తుల మీద జరగనప్పటికీ అన్ని సర్పంచ్ స్థానాల్లో పట్టున్న దగ్గర గెలుపు గుర్రాలను బరిలోకి దింపుతున్నారట.ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్, పాల్వాయి హరీష్‌బాబు వంటి నేతలు తమ నియోజకవర్గాల్లో మెజారిటీ సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారట. ఎంపీలు, ఎమ్మెల్యేలు లేని దగ్గర స్వయంగా పార్టీనే రంగంలోకి దిగి అభ్యర్థులను నిలబెట్టడం, అభ్యర్థులు లేని దగ్గర బరిలో ఉన్న స్థానిక లీడర్లకు పార్టీ మద్దతు ఇవ్వడానికి రెడీగా ఉన్నారట. బీఎల్ సంతోష్ చేసిన దిశానిర్దేశం ప్రకారం సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను వెనక్కి నెట్టి రెండో స్థానంలో నిలవాలని పట్టుదలతో పనిచేస్తున్నారట. మరి కమలనాథుల కసరత్తు ఎంతవరకు వర్కౌట్ అవుతుందో.? ఏ మేరకు సత్తా చాటుతారో..వేచి చూడాలి.


# తొలి విడత ఏకగ్రీవాలు లెక్క తేలింది

## వికారాబాదలో 16.. జగిత్యాలలో ఒకటి

తొవిడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వ ముగిసింది. ఈక్రమంలో తొలి విడతలోని మొత్తం పంచాయతీల్లో 5 సర్పంచి, 133 వార్డు స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అలానే 129 సర్పంచి స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. ఏకగ్రీవాల్లో ఆదిలాబాద్ అత్యధికంగా 30 సర్పంచ్ స్థానాలతో ప్రథమ స్థానంలో ఉంది. ఇదిలా ఉంటే తొలి విడతలో భాగంగా 133 వార్డులకు నామినేషన్ దాఖలు కాలేదు. ఇక మిగిలిన 37,179 వార్డులకు 85,428 మంది నామినేషన్లు వేశారు. తొలి విడత నామినేషన్ల పరిశీలన పూర్తయిందితెలంగాణ పంచాయతీ ఎన్నికల హాడావుడి మొదలైంది. ఈక్రమంలో తొలి విడత పంచాయతీలకు సంబంధించి నామినేషన్ల పర్వం ముగిసింది. ఇక తొలి విడతలో భాగంగా 4,236 పంచాయతీలకు, 37, 179 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించి నామినేషన్ల పర్వ ముగిసింది. ఈ క్రమంలో తొలి విడతలో భాగంగా 5 పంచాయతీలకు, 133 వార్డులకు ఎన్నికలు జరిగే అవకాశం లేదని తెలుస్తోంది. కారణం ఇక్కడ నామినేషన్లు వేయలేదు.తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక వివరాలు వెల్లడించింది. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 5 సర్పంచ్ స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎస్ఈసీ తెలిపింది. అలాగే 133 వార్డుల్లోనూ పోటీకి ఎవరూ ముందుకు రాలేదని.. ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 37, 440 వార్డులకు గాను 133 మినహా మిగతా 37,179 స్థానాలకు.. 85,428 మంది నామినేషన్లు వేశారు.తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 4,236 పంచాయతీల్లో.. 5 మినహా మిగతా 4,231 సర్పంచ్ స్థానాలకు గాను 22,330 మంది నామినేషన్లు వేశారు.

# టీచర్లకు ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమయపాలన, హాజరుపై విద్యాశాఖ కఠిన చర్యలు చేపట్టింది. ముఖ గుర్తింపు హాజరు విధానం అమలుతో పాటు, నెల రోజుల పాటు సెలవు లేకుండా గైర్హాజరైన వారిని శాశ్వతంగా తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీర్ఘకాలికంగా విధులకు హాజరు కాని వారిపైనా చర్యలు తీసుకోనున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో కొందరు ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, ఇష్టానుసారంగా సెలవులు పెట్టడంపై పాఠశాల విద్యాశాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది.




ముఖ గుర్తింపు హాజరు విధానం అమలులోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల హాజరు, అనధికారిక గైర్హాజరు వివరాలపై విద్యాశాఖ దృష్టి సారించింది. పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ సోమవారం డీఈవోలతో ఆన్‌లైన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఒక ఉపాధ్యాయుడు అధికారికంగా సెలవు పత్రం ఇవ్వకుండా, చెప్పా పెట్టకుండా నెల రోజులపాటు విధులకు గైర్హాజరైతే వారిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించాలి అని డీఈవోలకు సూచించారు.వాస్తవానికి ఒక్క రోజు అనధికార గైర్హాజరుపైనా చర్యలు తీసుకోవచ్చు. అయినప్పటికీ ఉపాధ్యాయులు అనారోగ్యం లేదా ప్రమాదం వంటి సాకులు చెప్పి కోర్టుల్లో కేసులు వేసే అవకాశం ఉన్నందున.. నెల రోజుల గడువు తర్వాత షోకాజ్ నోటీసులు జారీ చేసి విచారణ జరిపి తొలగించాలని నిర్ణయించారు. తొలగింపు వివరాలను గెజిట్‌లో కూడా ప్రచురించాలని ఆదేశించారు. గత ఆగస్టు నుంచి అమలులో ఉన్న విధానం ద్వారా టీచర్లు పాఠశాలకు వచ్చిన, వెళ్లిపోయిన సమయం కచ్చితంగా నమోదవుతోంది. ఇప్పటివరకు కేవలం హాజరు అయ్యారా లేదా అనే దానిపైనే దృష్టి పెట్టగా.. ఇకనుంచి ఆలస్యంగా వచ్చే ఉపాధ్యాయులపైనా చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. అమలుతో కొంత ఆలస్యంగా వస్తా.., ముందుగా వెళ్తా.. అని అడిగే మొహమాటాలు హెచ్ఎంలకు తప్పాయని, భవిష్యత్తులో సమయపాలనపై మరింత పకడ్బందీగా చర్యలు ఉంటాయనే భావన ఉపాధ్యాయుల్లో ఏర్పడిందని గెజిటెడ్ హెచ్ఎంలు చెబుతున్నారు.దీర్ఘకాలిక సెలవులు తీసుకొని, వాటిని పొడిగించుకోకుండా ఒకటి, రెండేళ్ల పాటు విధులకు హాజరు కాని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ఎక్కువగా విదేశాల్లోని తమ పిల్లలు లేదా భాగస్వాముల వద్దకు వెళ్లేందుకే ఈ సెలవులు తీసుకుంటున్నారు. అలాంటి వారిని గత రెండేళ్లలో సుమారు 50 మందిని విద్యాశాఖ ఉద్యోగం నుంచి తొలగించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని దాదాపు 24 వేల పాఠశాలల్లో 1.15 లక్షల మంది టీచర్లు పనిచేస్తుండగా.. వీరిలో 6,100 మంది డిప్యుటేషన్లపై ఇతర విభాగాల్లో ఉన్నారు. దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరవుతున్న మిగిలిన ఉపాధ్యాయులను కూడా గుర్తించి తొలగింపు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు డీఈవోలను ఆదేశించారు. ఈ కొత్త నిబంధనల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, హాజరు మెరుగుపడుతుందని విద్యాశాఖ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# మాట నెగ్గించుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మద్యం షాపుల నిర్వహణపై తనదైన శైలిలో కొన్ని షరతులు విధించిన సంగతి తెలిసిందే. ఊరి చివరనే మద్యం షాపులు, మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే అమ్మకాలు, పర్మిట్ రూములకు సాయంత్రం 6 గంటల తర్వాతే అనుమతి వంటి సూచనలు చేశారు. తాజాగా మద్యం దుకాణాలు గెలుచుకున్న షాపు యజమానులు.. ఇప్పుడు వాటిని అమలు చేస్తున్నారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యే మాట నెగ్గిందని చర్చించుకుంటున్నారు. అన్ని చోట్లా ఇలానే ఉంటే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. నిత్యం ఏదో ఒక అంశం మీద స్పందిస్తూ వార్తల్లో నిలుస్తుంటారు. ఈక్రమంలో గతంలో మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వైన్ షాపులు దక్కించుకున్న వారు.. గ్రామానికి చివర మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని.. అలానే ఉదయం నుంచే వైన్స్ తెరవద్దని.. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే మద్యం అమ్మకాలు ప్రారంభించాలని సూచించారు. దీనితో పాటుగా.. అసలు పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వొద్దని.. ఒకవేళ ఇవ్వాల్సి వస్తే.. సాయంత్రం ఆరు గంటల తర్వాతే వాటిల్లోకి అనుమతివ్వాలని సూచించిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో పెద్ద గందరగోళమే చెలరేగింది. కానీ ఈ అంశంలో రాజగోపాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారు. మద్యం షాపుల నిర్వహణలో ఆయన సూచనలు అమలు చేస్తున్నారు దుకాణాదారులుమునుగోడు నియోజకవర్గంలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వైన్స్ యజమానులు.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచన మేరకు ఊరి బయటే మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. అలానే ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే మద్యం విక్రయాలు మొదలుపెడుతున్నారు. సాయంత్రం 6 గంటలకు పర్మిట్‌రూంలోకి అనుమతి ఇస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారని కామెంట్ చేస్తున్నారు స్థానికులు. అన్ని గ్రామాల్లో ఇదే అనుసరిస్తే.. చాలా బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. మునుగోడు నియోజకవర్గంలోని మద్యం దుకాణాల యజమానులతో కీలక భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మద్యం షాపు ఓనర్స్‌కు కీలక సూచనలు చేశారు. బెల్ట్ షాపులు నిర్వహించొద్దని, సిండికేట్ ఏర్పడకూడదని.. ఊరి చివరే మద్యం అమ్మకాలు జరపాలని.. అలానే పర్మిట్‌రూంలకు పర్మిషన్ ఇవ్వొద్దని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వారికి సూచించిన సంగతి తెలిసిందే.అనంతరం మద్యం దుకాణాలు దక్కించుకున్న యజమానులతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. హైదరాబాద్‌లోని తన నివాసంలో ప్రత్యేక భేటీ నిర్వహించారు. ఆయన పెట్టిన కండీషన్లకు మద్యం దుకాణాదారులు, వ్యాపారులు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఊరి బయటే మద్యం షాపులను ఏర్పాటు చేయగా.. తాజాగా సోమవారం వాటిని ప్రారంభించారు. అలానే ఎమ్మెల్యే సూచించనట్లుగానే మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతనే మద్యం విక్రయాలు ప్రారంభించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



"మేము నటులం.. కాబట్టి వైఫల్యాలను కూడా అనుమతిస్తేనే కెరీర్‌లో ముందడుగు వేయగలం" అని అంటోంది కథానాయిక పూజా హెగ్డే. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను మెప్పించే ఈ భామ సందడి ప్రస్తుతం తెలుగులో తక్కువైనా.. తమిళంలో మాత్రం జోరు చూపిస్తోంది. ఇటీవలే 'రెట్రో' సినిమాతో తెరపైకి వచ్చిన ఈమె.. త్వరలో విజయ్‌తో కలిసి 'జన నాయగన్'తో అభిమానుల్ని పలకరించడానికి సన్నద్ధమవుతోంది. ఈ సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పూజ.. బాక్సాఫీసు వైఫల్యాలను, తన సినీప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది. "విజయ్ నేను కలిసి నటించిన 'బీస్ట్' సినిమా కథ, మ్యూజిక్ పరంగా ప్రేక్షకుల్ని మెప్పించింది. ఇప్పుడు మరోసారి 'జన నాయగన్'లో ఆయనతో పనిచేయడం ఉత్సాహంగా ఉంది. అద్భుతమైన నటుడు విజయ్. కానీ ఇదే ఆయన చివరి చిత్రం కావడం బాధాకరంగా ఉంది. నా దృష్టిలో ఇదొక చేదు వార్త. ఎందుకంటే నాతో పాటు చాలా మంది అభిమానులు విజయ్ సినిమాల్ని ఇష్టపడతారు. ఆయన చిత్రాల కోసం ఎదురుచూసిన రోజులూ ఉన్నాయి".

**సాధించాల్సింది ఇంకా ఉంది**

# పరాజయాల్ని అంగీకరించకపోతే.. కొత్తగా ఏం ఇవ్వలేం!

"ఈ మధ్య కాలంలో నేను నటించిన 'సర్కస్', 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్', 'దేవా' లాంటి చిత్రాలు బాక్సాఫీసు వద్ద ఆశించిన ఫలితాల్ని ఇవ్వలేకపోయాయి. కొన్నేళ్లుగా నా కెరీర్‌లో విజయం అనే పదానికి నిర్వచనమే మారిపోయిందని తెలుసు. కానీ ఈ దశ నాకు చాలా ముఖ్యమైంది. ఇప్పుడు నా రాబోయే సినిమాలు.. భవిష్యత్తు ప్రాజెక్టులు నేను ఎలాంటి నటిని అనే విషయాన్ని ప్రేక్షకులకు మరోసారి చూపిస్తుందని ఆశిస్తున్నా. నిజం చెప్పాలంటే సినిమా నేపథ్యం నుంచి వచ్చిన నాలాంటి వాళ్లు చాలా మందే ఉన్నారు చిత్రపరిశ్రమలో. వారందరూ అవకాశాలను దక్కించుకోవాలంటే చాలా కష్టపడాలి. ఎన్నో సవాళ్లు, అనుభవాలతో సినీరంగంలో ప్రస్తుతం నేను ఒక స్థాయిలో ఉన్నాను. కానీ ఇంకా సాధించాల్సింది చాలా ఉంది".

**హెచ్చుతగ్గులు అనేవి సాధారణం**

"కొన్ని సినిమాల్లోని పాత్రల్లో నటిస్తున్నప్పుడు అందులో జీవిస్తాం. ఆ పాత్రలో మమ్మల్ని మేము ఊహించుకుంటాం. ఒక వేళ అది హిట్ కాకపోతే ఆశ్చర్యానికి గురి కావాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మేము నటులం.. విఫలమవ్వడాన్ని కూడా స్వీకరించాలి. ఒక వేళ దాన్ని అంగీకరించకపోతే.. మేము కొత్తగా ప్రేక్షకులకు ఏమి ఇవ్వలేము. కొన్నిసార్లు అంచనాలు పెట్టుకున్న చిత్రాలే బోల్తా పడతాయి.

# చెత్త సినిమాలు చేశా.. అందరూ దూరం పెట్టారు, ఛాన్సుల్లేక..: బాలీవుడ్ నటి



కోయిల, బాద్‌షా, దిల్లగీ, పార్ట్‌నర్ వంటి బాలీవుడ్ హిట్ సినిమాల్లో నటించింది. హిందీ బిగ్‌బాస్ 8వ సీజన్‌లోనూ పాల్గొంది. బుల్లితెరపైనా పలు సీరియల్స్‌లో తళుక్కుమని మెరిసింది. అయితే కొన్ని చెత్త సినిమాలను సెలక్ట్ చేసుకోవడం వల్ల అవకాశాలు తగ్గడంతో బుల్లితెరకు షిఫ్ట్ కావాల్సి వచ్చిందంటోంది. ఇన్‌స్టంట్ బాలీవుడ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీప్శిఖ మాట్లాడుతూ.. నేను తీసుకున్న కొన్ని తప్పుడు నిర్ణయాలు కెరీర్‌ను దెబ్బకొట్టాయి. అప్పట్లో ఎలా ఉండేదంటే.. యశ్ రాజ్, సుభాష్ వంటివారు నిర్మించేవి మాత్రమే ఏ గ్రేడ్ సినిమాలుగా పరిగణించేవారు. కొత్త నిర్మాణ సంస్థ ఏదైనా ప్రాజెక్ట్ చేస్తుందంటే అది బీ గ్రేడ్ సినిమాలకిందే లెక్కేసేవారు. నాకు ఏవి సెలక్ట్ చేసుకోవాలనేది అర్థం కాలేదు. పైగా నా ఫ్యామిలీలో ఎవరికీ సినీరంగంతో పరిచయమే లేదు. కానీ సినీరంగంలో మనకు సలహాలిచ్చే వ్యక్తి ఉంటే బాగుంటుందని నాకిప్పుడనిపిస్తుంది. సినిమాల ఎంపికలో చాలా తప్పులు చేశాను. మా తాతయ్య ఏమనేవారంటే.. ఏ పనీ చిన్నది, పెద్దది అని వ్యత్యాసం చూపించకూడదనేవారు. ఏదైనా పనే అనేవారు. దాన్ని నేను సీరియస్‌గా తీసుకున్నాను. అందుకనే నాకు ఏ అవకాశం వచ్చినా ముందూవెనకా ఆలోచించకుండా చేసుకుంటూ పోయాను. ఈ క్రమంలో ఎన్నో చెత్త సినిమాలు చేశా.. అవి ఇప్పటికీ రిలీజ్ కాకుండా ఆగిపోయాయి. కొన్ని విడుదలయ్యాయి.. కానీ, అవి నా కెరీర్‌ను దెబ్బకొట్టాయి. ఉదాహరణకు ట్రేడ్ గైడ్ అనే సినిమా చేసినప్పుడు ఓ పోస్టర్ వదిలారు. అప్పటికే నేను చాలా పెద్ద సినిమాలకు సంతకం చేశాను. కానీ ఆ పోస్టర్ చూశాక నేను బీ గ్రేడ్ సినిమాలు చేస్తున్నానని పక్కన పెట్టేశారు. నాకు విషయం అర్థమయ్యేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

# ఎస్ఎస్ఎంబీ29'లో మాధవన్?





కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు రాజమౌళి కలయికలో రూపొందుతున్న 'ఎస్ఎస్ఎంబీ29' (వర్కింగ్ టైటిల్) చిత్రం చకచకా చిత్రీకరణ పూర్తి చేసుకుంటోంది. ఇందులో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నప్పటికీ.. ఇంతవరకు వాళ్ల పాత్రలకు సంబంధించి ఏ అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా, ఇప్పుడీ సినిమాలో ప్రముఖ నటుడు ఆర్.మాధవన్ భాగం కానున్నట్లు సమాచారం అందుతోంది. దీంట్లోని ఓ కీలక పాత్ర కోసం చిత్ర బృందం ఆయన్ని సంప్రదించినట్లు తెలిసింది. త్వరలోనే ఆయన సెట్స్‌లోకి అడుగు పెట్టనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇది అటవీ నేపథ్యంలో సాగే ప్రపంచాన్ని చుట్టేసే సాహసికుడి కథగా రూపొందుతున్నట్లు వార్తలొస్తున్నాయి. దీన్ని భారీ బడ్జెట్‌తో నిర్మాత కె.ఎల్ నారాయణ నిర్మిస్తున్నారు.

# నన్ను దెయ్యమంటూ వెక్కిరించారు ప్రముఖ కమెడియన్ కుమార్తె



**బా**లీవుడ్ ప్రముఖ హాస్య నటుడు జానీ లీవర్ కుమార్తెగా సినీ ప్రియులకు సుపరిచితురాలయ్యారు జేమీ లీవర్ తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. సినీ ఇండస్ట్రీలోనే కాకుండా వ్యక్తిగతంగానూ తాను ఎదుర్కొన్న వేధింపుల గురించి వెల్లడించారు. శరీర రంగును ఆధారంగా చేసుకుని చాలామంది తనని వెక్కిరించారని చెప్పారు. తెల్లగా మారమని సూచించారన్నారు. "నేను ఒకింత నల్లగా ఉంటాను. శరీర రంగు విషయంలో నేనెప్పుడూ బాధపడలేదు. కానీ ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నా. "నువ్వు అందహీనంగా ఉన్నావు. దెయ్యంలా ఉన్నావు. ఇండస్ట్రీలో నీకు పని దొరకడం కష్టం. " అని ఎంతోమంది నన్ను ఎన్నో రకాలుగా మాటలన్నారు. చిన్నతనం నుంచి నా రంగు విషయంలో ఇలాంటి మాటలే వింటున్నా. నన్ను చూసిన వాళ్లు.. సౌందర్య ఉత్పత్తులు వాడొచ్చు కదా అని చెప్పేవారు. జీవితంలో నేను విజయం సాధించాలంటే ముందు తెల్లగా మారాలని అందరూ అనుకున్నారు. నిజం చెప్పాలంటే ఎంతోమంది ఇలాంటి విమర్శలు ఎదుర్కొంటున్నారు. శరీర రంగు అనేది మన సమాజంలో ఉన్న సమస్య" అని ఆమె చెప్పారు. రంగు మాత్రమే కాకుండా శరీరాకృతి విషయంలో సొంత కుటుంబ సభ్యుల నుంచీ విమర్శలు ఎదురైనట్లు ఆమె తెలిపారు. ఇదే ఇంటర్వ్యూలో ఆమె బాల్యంలో తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని బయటపెట్టారు. "చిన్నతనం నుంచి జీవితంలో నేను ఏదో ఒక సమస్య ఎదుర్కొంటూనే ఉన్నా. స్కూల్ చదువుకునే రోజుల్లో నన్ను, నా స్నేహితురాలిని ఒక వ్యక్తి ఇబ్బందిపెట్టాలని చూశాడు. అతడి ప్రవర్తన వల్ల నాకెంతో భయం వేసింది.

# చెట్టు వెనక్కి వెళ్లి దుస్తులు మార్చుకోమన్నారు..: నటి



సీనియర్ నటి శోభన ఇటీవల ఇన్‌స్టా వేదికగా అభిమానులతో ముచ్చటించారు. తన కెరీర్‌కు సంబంధించిన ఎన్నో విషయాలను నెటిజన్లతో పంచుకున్నారు. ముఖ్యంగా బాలీవుడ్ అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్‌తో 'కల్కి 2898 ఏడీ' లో వర్క్ చేయడంపై ఆమె స్పందించారు. ఈ సినిమా కంటే ముందు ఎన్నో ఏళ్ల క్రితం ఆయనతో కలిసి వర్క్ చేశానని ఆనాటి రోజులు గుర్తు చేసుకున్నారు. అంతేకాకుండా, ఆ సమయంలో తనకు ఎదురైన ఒక చేదు అనుభవాన్ని ఆమె బయటపెట్టారు. "అమితాబ్ బచ్చన్ ఎంతో మంచి వ్యక్తి. ఆనాటి నుంచి ఇప్పటివరకూ ఆయన ఏమీ మారలేదు. మానవత్వం ఉన్న వ్యక్తి. ఆయన గురించి మీ అందరికీ ఒక ఆసక్తికర విషయాన్ని చెప్పాలనుకుంటున్నాను. 'కల్కి' కంటే ముందు ఎన్నో ఏళ్ల క్రితం ఆయనతో నేనొక ప్రాజెక్ట్ కోసం వర్క్ చేశాను. ఆయన హీరోగా నటించిన సినిమాలో ఒక పాటకు డ్యాన్స్ చేశా. సాంగ్ షూటింగ్ అహ్మదాబాద్‌లో జరిగింది. ఆ ఒక్క సాంగ్‌లోనే నేను చాలా కాస్ట్యూమ్స్ మార్చుకోవాల్సి ఉంది. హీరో కోసం ప్రత్యేకంగా కారవాన్ తెప్పించారు. ఆయన్ని చూసేందుకు అహ్మదాబాద్ ప్రజలు భారీ సంఖ్యలో మా సెట్‌లోకి అడుగుపెట్టారు. షూట్‌లో భాగంగా నేను దుస్తులు మార్చుకోవాల్సి రావడంతో.. 'నా కారవాన్ ఎక్కడ?' అని చిత్రబృందాన్ని అడిగాను. వారిలో ఒక వ్యక్తి.. "ఆమె కేరళ నుంచి వచ్చారు. అక్కడివాళ్లు దేనికైనా సర్దుకుపోతారు. కాబట్టి ఆమె చెట్ల వెనక్కి వెళ్లి దుస్తులు మార్చుకుంటుందిలే" అని అన్నాడు.

**ప్రభాస్ కొత్త చిత్రం.. గోడ దూకి సెట్‌కు వెళ్లిన 70 ఏళ్ల నటుడు**

ఆ వ్యక్తి మాటలను అమితాబ్ బచ్చన్ వాకీ టాకీలో విన్నారు. ఆయనకు బాగా కోపం వచ్చింది. వెంటనే కారవాన్ నుంచి బయటకు వచ్చి అతడిని తిట్టారు. తన కారవాన్‌ను నాకు ఇచ్చారు. ఇన్నేళ్ల తర్వాత 'కల్కి' వల్ల ఆయనతో కలిసి వర్క్ చేసే అవకాశం మరోసారి దక్కింది. సంస్కృతి, సాంప్రదాయాలకు ఆయన ఎంతగానో విలువ ఇస్తారు. 'కల్కి' చిత్రీకరణ సమయంలో ఎవరైనా తన వద్దకు వస్తే లేచి నిల్చొని విష్ చేసేవారు. 'మీరు లేచి విష్ చేయాల్సిన అవసరం లేదు సర్' అని చెప్పినా ఆయన వినేవారు కాదు" అని శోభన తెలిపారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.